
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

మంగళవారం 4 మార్చి 2025






గుంటూరు ఏసీ కళాశాల కౌంటింగ్ కేంద్రంలో ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది


కౌంటింగ్ కేంద్రంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ

పట్టభద్రుల పోరులో..
కూటమి దూకుడు

- ఒక్కో రౌండ్‌లో సగటున 10 వేలకు పైగా ఓట్ల ఆధిక్యం
- ఐదో రౌండ్ ముగిసేసరికే 47,872 ఓట్ల ఆధిక్యంలో ఆలపాటి
- ఓట్ల లెక్కింపులో తేలిపోయిన పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు

గుంటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదు(తెలుగుదేశం) ఘన విజయం దిశగా దూసుకుపోతున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు గుంటూరులోని ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో ఈ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. స్ట్రాంగ్ రూంల సీళ్లను అభ్యర్థులు, ఏజంట్ల సమక్షంలో తెరిచి బ్యాలెట్ బాక్సులను భద్రంగా కౌంటింగ్ హాల్‌లోకి చేర్చారు. అనంతరం ఏజంట్ల సమక్షంలో సీళ్ల తెరిచి బ్యాలెట్ పేపర్లను మిశ్రమం చేశారు. ఆ తర్వాత 50 చొప్పున కట్టలు కట్టారు. ఆర్వో టేబుల్ వద్ద పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కూడా తెరిచారు. మొత్తం 371 పోస్టల్ బ్యాలెట్లకు 55 చెల్లుబాటు కాలేదు. దాంతో 316 బ్యాలెట్లను తొలి రౌండ్ కౌంటింగ్‌లోకి తీసుకొచ్చారు. మొత్తం పోలింగ్ అయిన 2,41,493 ఓట్లను 50 చొప్పున 4,828 బండిల్స్(కట్టలు)గా చేశారు. మిగిలిన 93 ఓట్లతో మరో కట్ట కట్టారు. కౌంటింగ్ హాల్‌లో 28 టేబుల్స్ ఏర్పాటు చేసి ఒక్కో టేబుల్‌పైకి ఒక్కో రౌండ్‌లో 1000 ఓట్లను లెక్కింపునకు పంపారు. కౌంటింగ్ సిబ్బంది ఒక్కో కట్ట తెరిచి బ్యాలెట్ పేపర్‌ని ఏజంట్లకు చూపిస్తూ చెల్లుబాటు కాకపోతే ప్రత్యేకంగా ట్రేలో పడేసి చెల్లుబాటు అయిన తొలి ప్రాధాన్య ఓట్లను అభ్యర్థుల వారీగా వారికి కేటాయించిన ట్రేలలో అమర్చారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.29 (మంగళవారం)
సహరి : 5.10 (బుధవారం)

తొలి రౌండ్‌లోనే భారీ ఆధిక్యం

ఆలపాటి రాజేంద్రప్రసాదుకు తొలి రౌండ్‌లోనే భారీ ఆధిక్యం లభించింది.



అన్ని టేబుళ్లపైనా ఆయనకు మెజార్టీ వచ్చింది. దాంతో తొలి రౌండ్‌లో 17,194 ఓట్లు ఆలపాటికి రాగా లక్ష్మణరావుకు 7214 ఓట్లు వచ్చాయి. చెల్లని ఓట్లు 3070గా ఉన్నాయి. తొలి రౌండ్‌లో 28,312 ఓట్లు లెక్కించారు. రెండో రౌండ్‌లో ఆలపాటికి 17527 ఓట్లు, లక్ష్మణరావుకు 6742 ఓట్లు వచ్చాయి. ఈ రౌండ్‌లోనూ చెల్లని ఓట్లు 3005 ఉన్నాయి. దీంతో ఆలపాటి మెజార్టీ 20765కు చేరుకొన్నది. మూడో

(మిగతా 7వ పేజీలో)

ధ్రువీకరణ పత్రం
నకిలీ సిత్రం



- దొంగ పత్రాలతో ప్రభుత్వ భూమి హాంఫట్!
- అవే అధికారిక పట్టాలుగా భూ ఆక్రమణ
- గత ప్రభుత్వ కాలంలో గుట్టుచప్పుడు కాకుండా భూ దందా
- ఇప్పుడిప్పుడే ఒక్కొక్కటిగా వెలుగులోకి
- ఏ స్థాయిలో ఉందనేది విచారణలో తేలాల్సిందే
- పోలీస్ కేసు పెట్టే ఆలోచనలో రెవెన్యూ అధికారులు !

అదొక ధ్రువపత్రం మాత్రమే. దానినే ప్రభుత్వ పట్టాగా చలామణి చేశారు. ప్రభుత్వ, ప్రయివేటు భూములలో పాగా వేసేశారు. అది ఇంతటితో ఆగకుండా జగనన్న కాలనీలకోసం కేటాయించిన స్థలాలనే కబ్జా చేసేశారు. అర్హులైన లబ్ధిదారులకు ఒక్క సెంటు మాత్రమే జాగా ఇస్తే, వీరు ఈ పత్రాలతో ఏకంగా రెండు సెంట్ల చొప్పున సొంతం చేసుకున్నారు. తెనాలిలో ఆలస్యంగా బయటపడిన నకిలీ ధ్రువపత్రాల వ్యవహారం రెవెన్యూ శాఖ ను ఉలిక్కిపడేలా చేసింది. ఇదే తరహాలో ఒక ముఠా భూమికి విలువ ఎక్కువగా ఉన్న పట్టణాలు, రాజధాని ప్రాంతాల్లో ఈ తరహా నకిలీ ధ్రువపత్రాలతో ప్రభుత్వ భూముల్లో పాగా వేస్తే, అది ఎంత విస్తీర్ణం? ఎంతమంది అక్ర మార్కులు దీని వెనుక దాగున్నారనేది అంతు బట్టని విషయం. పట్టా లేకున్నా కనీసం ఏదో ఒక అధికారిక ధ్రువ పత్రం ఉంది కదా! అని సరిపెట్టుకుందా మంటే, అదికూడా అసలు కాదు... అచ్చుగుద్దినట్టు అసలుకు నకిలీని దింపేశారు. ఇక్కడ వీరు చేసిన తప్పేంటంటే!... ప్రతి ప్రభుత్వ ఉత్తర్వులకు కానీ, ధ్రువపత్రాలకు కానీ సంబంధిత రికార్డు నంబర్ ఉంటుంది. ఆ ఒక్క విషయాన్ని మర్చిపోయి ఏ నంబర్ కానీ కనీసం తేదీ కూడా లేకుండా తయారు చేయటమే. అదే ఈ నకిలీ పత్రాల కుంభ'కోణాన్ని' గుర్తించటానికి ఆధారమయింది. పైగా ఈ ధ్రువపత్రంలో గౌరవ శాసనసభ్యునికి అర్జీ పెట్టుకున్నారని, అందుకే స్థలాన్ని కేటాయించినట్టు పేర్కొనటం కూడా నకిలీ గుట్టు రట్టు చేసింది. అధికారానికో! లేక డబ్బుకో తలూపే అధికారులుంటే చిత్తుకాగితం కూడా హక్కు పత్రమైపోతుందనటానికిదో ఉదాహరణ. దీని ఆధారంగా ప్రభుత్వ భూములను సొంతం చేసుకోవటం కొసమెరుపైతే, వాటిలో పాగా వేసిన వారి గురించి రెవెన్యూ శాఖ అసలు పట్టించుకోకపోవటం మరో విశేషం. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవహారం బయటకు పొక్కటంతో దీని మూలాలను ఛేదించే పనిలో పడ్డారు.



పట్టా అంటూ ధ్రువీకరణ పత్రాన్ని ఇచ్చేసి, స్థలాలను అప్పనంగా దోచేసిన అక్రమార్కులు

తెనాలి, మార్చి 03, (ఆంధ్రజ్యోతి): ఒక చిత్తు కాగితం ఇక్కడ అధికారిక ధ్రువపత్రం అయిపోయింది. దీని ఆధారంగానే ప్రభుత్వ భూములను, జగనన్న కాలనీల్లోని స్థలాలను అధికారులు కట్టబెట్టారో! లేక అక్రమార్కులే దోచేశారో కానీ కబ్జాల పర్వం మాత్రం యథేచ్ఛగా సాగిపోయింది. సాధారణంగా ఒక ప్రభుత్వ భూమిని వ్యక్తులకు కానీ, లేక ప్రైవేటు సంస్థలకు కానీ కేటాయించాలంటే 2012లో విడుదల చేసిన జీఓ నంబర్ 571 ప్రకారం తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి ఉండాలి. ఇదంతా తహసీల్దార్, సబ్‌కలెక్టర్, జిల్లా కలెక్టర్ ద్వారా ప్రతిపాదన పంపాలి. చిన్నపాటి స్థలాలు కాకుండా రూ. 50 లక్షల విలువకు మించిన భూమి అయితే దానికి క్యాబినెట్ అనుమతి ఉండాలి. అయితే తెనాలిలో అవేమీ లేకుండా కేవలం ఒక ధ్రువీకరణ పత్రం పేరుతో స్థలాల హద్దులు చూపించిమరీ అప్పనంగా అప్పగించేశారు. ఇంతటి పక్కా హద్దులతో స్థలాలు కేటాయించారంటే, దీని వెనుక రెవెన్యూ శాఖలోని ఉద్యోగుల పాత్ర ఎంతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. తెనాలిలో గత తహసీల్దార్ల కాలంలో జరిగాయా! లేక తహసీల్దార్ల బదిలీ జరిగిన

(మిగతా 7వ పేజీలో)


కబ్జాకు గురైన ఇరిగేషన్ భూమి

సాగర్ భూముల కబ్జా

- ప్లాట్లు వేసి విక్రయాలు
- వెలుగులోకి వస్తున్న వైసీపీ నేతల అరాచకాలు

మాచర్లటౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో నాగార్జున సాగర్ భూముల విచ్చలవిడిగా కబ్జాకు గురయ్యాయి. వారి దందాకు అధికారులు కూడా సహకరించడంతో మాచర్ల శివారు ప్రాంతంలోని రూ. 2 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించి సెంటు లక్ష రూపాయల చొప్పున అమ్మేశారు. గతంలో మాచర్లను శాసించి, ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న నేత, అతనికి సన్నిహితంగా ఉండే ఓ మహిళతో పాటు మరో హోంగార్డు కలిసి సాగర్ కుడి కాలువ సమీపంలోని గ్లోరి క్రైస్ట్ చర్చి ఎదురుగా ఉన్న సుమారు రెండు ఎకరాల ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించి ప్లాట్లుగా అమ్మేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయా అంశాలపై విచారణ మొదలు పెట్టడంతో అక్రమార్కుల్లో అలజడి మొదలైంది.


పోటీలలో తలపడుతున్న కృష్ణవేణి, ఏఎన్‌యూ జట్లు

పోటాపోటీగా మహిళ బ్యాడ్మింటన్ పోటీలు

నరసరావుపేట టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేట ఫార్మసీ కళాశాలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర కళాశాలల మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇక్కడ ఎంపికైన విద్యార్థులు కరైకుడిలోని అలగప్ప యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా మహిళల అంతర విశ్వవిద్యాలయాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.


పట్టాలెక్కనున్న.. వాటర్ గ్రిడ్

- తుది దశలో టెండర్ ప్రక్రియ
- వారంలో ఖరారు
- రూ 1,200 వ్యయంతో పైపులైన్ల నిర్మాణం
- విజయపురిసౌత్ హిల్ కాలనీ వద్ద నీటి శుద్ధిప్లాంట్
- జల్ జీవన్ పథకం నుంచి నిధులు
- తొలి విడతలో 10 మండలాలకు అమలు

జిల్లాలో వాటర్ గ్రిడ్ పనులు పట్టాలెక్కనున్నాయి. ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ తుది దశకు చేరింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో దాఖలైన టెండర్‌లను తెరవలేదు. 9న టెండర్‌లను తెరచి కాంట్రాక్టర్‌ను ఖరారు చేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. రూ. 1,200 కోట్ల వ్యయంతో తొలి విడత జిల్లాలో పనులు చేపట్టనున్నారు. జల జీవన్ మిషన్ పథకం కింద నిధులు విడుదలయ్యాయి. వైసీపీ హయాంలో ఈ పథకం ప్రారంభం అయినప్పటికీ వాటర్ గ్రిడ్ పనులు చేపట్టలేదు. ఐదేళ్లు ఈ పథకాన్ని అటకెక్కించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రిడ్ పనులకు టెండర్లు నిర్వహించింది. మూడు సంస్థలు గ్రిడ్ పనులకు టెండర్లు దాఖలు చేశాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్లెల్లో ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించడమే జలజీవన్ మిషన్ లక్ష్యం. కూటమి ప్రభుత్వం వాటర్ గ్రిడ్ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. జల్ జీవన్ మిషన్ పథకాన్ని 2028 వరకు పొడిగించడంతో పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ పథకాన్ని జిల్లాలోని అన్ని గ్రామాలకు అమలు చేస్తారు. అయితే తొలివిడతలో 10 మండలాల్లోని 325 గ్రామాలకు అమలు చేస్తున్నారు. మాచర్ల, వెల్దుర్తి, రెంటచింతల, దుర్గి, కారంపూడి, గురజాల, మాచవరం, దాచేపల్లి, పిడుగురాళ్ల, బెల్లంకొండ మండలాలకు అమలు చేస్తున్నారు. నాగార్జున సాగర్ బ్యాక్ వాటర్ ను వినియోగిస్తారు. విజయపురిసౌత్ హిల్ కాలనీ సమీపంలో నీటి శుద్ధి ప్లాంట్‌ను నిర్మిస్తారు. ప్లాంట్‌కు నీటిని సాగర్ బ్యాక్ వాటర్‌ను ఇన్‌టేక్ వెల్ ద్వారా సరఫరా చేస్తారు. సాగర్ నుంచి నేరుగా నీటిని వినియోగించుకునే విధంగా పథకాన్ని నిర్మిస్తున్నారు. సంవత్సరం పొడవునా వాటర్ గ్రిడ్‌కు నీటి సరఫరా అవకాశం ఉంది.


వెల్దుర్తిలో బోరు ద్వారా నీటి సరఫరా

వాటర్ గ్రిడ్ అమలు చేసే పది మండలాల వారీగా కుళాయిల వివరాలు...

మండలం	గృహాల సంఖ్య	కుళాయిలు ఉన్న గృహాలు	శాతం
మాచర్ల	17,920	6,649	37.10
వెల్దుర్తి	20,764	6,532	31.46
దుర్గి	17,400	5,388	30.97
కారంపూడి	16,949	5,332	31.46
రెంటచింతల	11,283	4,411	39.09
గురజాల	12,269	1,134	9.24
దాచేపల్లి	11,232	3,744	33.33
మాచవరం	15,156	4,845	31.97
పిడుగురాళ్ల	18,499	2,115	11.43
బెల్లంకొండ	8,129	2,521	31.01

రెండో విడతలో రూ. 2,200 కోట్లతో డీపీఆర్

రెండో విడతలో వాటర్ గ్రిడ్ పథకాన్ని జిల్లాలోని 18 మండలాల్లోని 468 గ్రామాలకు అమలు చేస్తారు. అయితే నీటి శుద్ధి ప్లాంట్ నుంచి పైపు లైన్‌ను ఆయా మాండలాలకు పొడిగించనున్నారు. గ్రిడ్ అమలుకు రెండో విడతలో రూ2,200 కోట్లు వ్యయం అంచనాలను ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ రూపొందించింది. ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను ప్రభుత్వానికి అధికారులు అందజేశారు. గ్రిడ్ అమల్లో వస్తే జిల్లాలోని గ్రామాల్లో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.



ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 96.83 శాతం హాజరు

నరసరావుపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సోమవారం ప్రారంభమయ్యాయి. 96.83 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మొత్తం 13,970 మంది విద్యార్థులకు 13,527 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నీలావతి దేవి వివరించారు. 443 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు పేర్కొన్నారు.

న్యాయం చేస్తాం

- సాయిసాధన చిట్ బాధితులకు సీఎం హామీ

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట సాయిసాధన చిట్ ఫండ్ బాధితులు సోమవారం సీఎం చంద్రబాబును, మంత్రి లోకేశ్‌ను కలిసేందుకు ఉండవల్లిలోని సీఎం నివాసానికి వచ్చారు. అదే సమయంలో సచివాలయం నుంచి నివాసానికి వచ్చిన సీఎం చంద్రబాబు పెద్ద సంఖ్యలో ఉన్న చిట్‌ఫండ్ బాధితులను చూసి తన కాన్వాయ్‌ని ఆపారు. రోడ్డుపైనే ఆగిన సీఎం సుమారు 10 నిమిషాలపాటు బాధితులు గోడు విన్నారు. 'సాయి సాధన 25 సంవత్సరాలుగా నడుస్తున్న చిట్‌ఫండ్ కంపెనీ. మమ్మల్ని మోసం చేసింది. రూ.250 కోట్లకు శఠగోపం పెట్టింది. దీంతో సుమారు 600 కుటుంబాలు రోడ్డున పడ్డాయి. చిట్‌ఫండ్స్ యజమాని పాలడుగు పుల్లారావు 40 రోజుల క్రితమే కోర్టుకు సరెండర్ అయిపోయారు. మాకు న్యాయం చేయండి' అంటూ మొరపెట్టుకున్నారు. బాధితుల గోడు విన్న సీఎం.. 'ప్రజల్ని మోసం చేసిన వాళ్లు కోర్టులో లొంగిపోయామంటే కుదరదు. బాధితులకు పూర్తి న్యాయం చేస్తాం. వారిని ఆదుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం' అని హామీ ఇచ్చారు.

జీడీసీసీపై.. ఆర్బీఐ కొరడా

- రూ. 50 వేలు పెనాల్టీ విధింపు
- ఫైన్ పడితే రానున్న రెండేళ్లు బ్యాంకుకు కష్టకాలమే
- 2022-23 బ్యాలెన్స్ షీట్ ప్రచురించటంలో విఫలం

గుంటూరు సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకుకు (జీడీసీసీ) కోలుకోలేని దెబ్బ తగిలింది. బ్యాంకు విధి విధానాలపై ఆర్బీఐ(రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా)కన్నెర్ర చేసింది. రూ. 50 వేలు పెనాల్టీ విధిస్తూ ఆదేశాలు జారీచేసింది. 2022-2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఖాతాలు, బ్యాలెన్స్ షీట్‌ను ప్రచురించడంలో బ్యాంక్ విఫలమైనందున ఈ చర్యలకు ఉపక్రమించింది. 2022-23 సంవత్సరాల్లోనే జీడీసీసీ బ్యాంకు వేదికగా రుణాల మంజూరులో అనేక అక్రమాలు జరిగాయి. ఈ నేపథ్యంలోనే బ్యాలెన్స్ షీట్ దాఖలు చేసేందుకు బ్యాంకు అధికారులు వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. ఖాతాల వివరాలు వెల్లడిస్తే నకిలీ భాగోతాలు వెలుగులోకి వస్తాయన్న భయంతోనే గోప్యత పాటించినట్లు అర్థం అవుతుంది. నకిలీ ఆధార్ కార్డులతో, ఈ-కేవైసీతో సంబంధం లేకుండా కోట్ల రూపాయలను వైసీపీ నేతలు కొల్లగొట్టారు. ప్రత్తిపాడుతో పాటు జిల్లాలోని 17 సహకార సంఘాల్లో అక్రమాలు జరిగాయి. మొత్తం రుణ మాఫియాలో 184 మంది రైతులు, 21 మంది జీడీసీసీ మేనేజర్‌లు, అసిస్టెంట్ మేనేజర్‌లు ఉన్నట్లు సహకార శాఖ తేల్చింది. క్షేత్ర స్థాయిలో కనీస పరిశీలన లేకుండానే మేనేజర్, సూపర్‌వైజర్, సీఈఓ, అడ్మినిస్ట్రేటివ్ సర్క్యులర్‌కి వ్యతిరేకంగా రుణాలు మంజూరు చేయటంతో అక్రమాలకు తెరలేచింది. ఇదే విషయాన్ని నాబార్డు కూడా తప్పు పట్టింది. గత ఐదేళ్లుగా సాగిన రుణ మాఫియా భాగోతంలో అసలు దోషుల పై చర్యలు తీసుకునేందుకు బ్యాంకు సీఈఓ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారు. ప్రత్తిపాడు బ్రాంచ్‌లో అక్రమాలకు పాల్పడిన 11 మంది నకిలీ రైతులను పోలీసులు అరెస్టు చేశారు. నకిలీ పాసు పుస్తకాలు, ఆధార్ కార్డులు, ఇతర డాక్యుమెంట్‌లు సృష్టించి రూ. 5 కోట్ల వరకు ఈ బ్రాంచ్ నుంచి కొల్లగొట్టినట్లు పోలీసులు తేల్చారు. కొందరు తహసీల్దార్‌లు,వీఆర్వోలు నిందితులుగా ఉన్నారు. జీడీసీసీ అక్రమాలపై మొత్తం 18 కేసులు నమోదు అయినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. జీడీసీసీ బ్యాంకు కు చెందిన 42 శాఖల్లో నూ అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. నల్లపాడు జీడీసీసీ శాఖలో కూడా రూ. 70 కోట్లకు పైగా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు రాగా, వివాదం ముదురుతున్న తరుణంలో రుణాలు తీసుకున్న వ్యక్తులు కొంత మొత్తం తిరిగి చెల్లించారు.

పెనాల్టీ పడితే అంతే..

ఏ బ్యాంకు అయినా ఆర్బీఐ పెనాల్టీ విధించడం తీవ్రమైన చర్యగా భావిస్తారు. దానివల్ల రానున్న రెండేళ్ల పాటు పెనాల్టీ విధించబడిన బ్యాంకు కు సంబంధించిన అన్ని విషయాల పై ఆర్బీఐ కన్ను వుంటుంది. పెనాల్టీ వేసిన తర్వాత బ్యాంకు కు సంబంధించిన డిపాజిట్లు విత్ డ్రా పై ఆర్బీఐ నియంత్రణ ఉంటుందని చెబుతున్నారు. ఇష్టానుసారంగా డిపాజిట్లు విత్ డ్రా చేయడానికి ఆర్బీఐ ఒప్పుకోక పోగా, పరిమితి కూడా పెడుతుంది. ఆర్బీఐకి సంబంధించిన ఆడిటర్ల చేత పెనాల్టీ విధించిన బ్యాంకు ను తనిఖీ చేయిస్తారని తెలుస్తున్నది. అంత మాత్రమే కాకుండా రెండేళ్ల పాటు అన్ని రకాల ఉత్తర ప్రత్యుత్తరాలపై కూడా ఆర్బీఐ కఠినంగా వ్యవహరిస్తుంది.


గుంటూరులోని జీడీసీసీ ప్రధాన కార్యాలయం

సొంత ఖాతా నుంచే ఇంటి అద్దె చెల్లించా!

▸ 'ఆంధ్రజ్యోతి' కథనంపై రిటైర్డ్ పీసీసీఎఫ్ చిరంజీవ్ వివరణ

అమరావతి, మార్చి3(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని రాష్ట్ర అటవీ శాఖ ప్రధాన కార్యాలయ భవనానికి రెండేళ్ల తర్వాత ఇతర ప్రభుత్వ విభాగాలు చెల్లించే అద్దెతో సమానంగానే అద్దె సవరించినట్టు రిటైర్డ్ పీసీసీఎఫ్ చిరంజీవ్ చౌదరి తెలిపారు. భవన యజమాని అటవీ శాఖ కార్యాలయాన్ని ఖాళీ చేయాలని లేదా ఇతర శాఖలతో సమానంగా అద్దె చెల్లించాలని కోరినందున అద్దె పెంచినట్లు వివరించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో అడవిలో 'కిమ్' రాజ్యం శీర్షికతో కథనం వచ్చిన నేపథ్యంలో ఆయన స్పందించారు. 2016నుంచి తాను రెయిన్ ట్రీ పార్కులో ఉంటుండగా, అదే సొసైటీకి చెందిన ప్రస్తుత ఇంటికి నెలకు రూ.50 వేలు తన వ్యక్తిగత బ్యాంక్ ఖాతా నుంచి అద్దె చెల్లిస్తున్నట్లు తెలిపారు. తన పదవీ కాలంలో ప్రభుత్వ వాహనాలను అధికారిక పనుల కోసమే వినియోగించానని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎప్పుడూ వాడలేదన్నారు. పీసీసీఎఫ్‌గా వాడిన వాహనాలన్నీ పదేళ్ల కంటే పాతవని చెప్పారు. శాఖాపరమైన బదిలీలు, పోస్టింగ్‌ల్లో ఏ ఒక్కరి ప్రమేయం, అవినీతికి ఆస్కారం లేకుండా ఉపముఖ్యమంత్రి మద్దతుతోనే చేసినట్లు తెలిపారు. చాలాకాలంగా ఒకే పోస్టులో ఉన్న వారిని పరిపాలనా కారణాలతో బదిలీ చేయగా, కోర్టు నుంచి అనుకూల ఉత్తర్వులు పొందారన్నారు.

సిబ్బంది కొరత వల్లే రెండు షిఫ్టుల విధానం

▸ 'ఆంధ్రజ్యోతి' కథనంపై రాజమండ్రి జైలు సూపరింటెండెంట్ వివరణ

రాజమహేంద్రవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జైలులో గార్డింగ్ సిబ్బంది కొరత కారణంగానే రెండు షిఫ్టుల విధానం అమలు చేస్తున్నామని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ పేర్కొన్నారు. జైళ్లశాఖ కోస్తాంధ్ర రీజియన్‌లో ఉన్నతాధికారికి, సిబ్బందికి నడుమ కొనసాగుతున్న వివాదంపై 'జైళ్ల శాఖ.. కోస్తాంధ్రలో కోల్డ్‌వార్' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై సూపరింటెండెంట్ తరఫున డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.రాజకుమార్ వివరణ ఇచ్చారు. జైలులో 220మంది గార్డింగ్ సిబ్బందికి గాను 155మంది మాత్రమే ఉన్నారన్నారు. షడ్రక్ అనే ఓపెన్ జైలు ఖైదీని డీఐజీ కార్యాలయంలో ఏసీ మరమ్మతు నిమిత్తం పంపించామని వివరించారు. ఈ విషయంలో కిందిస్థాయి ఉద్యోగిని సస్పెండ్ చేయలేదని, శాఖాపరమైన విచారణ కొనసాగుతోందన్నారు.

టెన్త్ హాల్‌టికెట్లు విడుదల

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లను విడుదల చేసినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సోమవారం తెలిపింది. విద్యార్థులు పాఠశాల లాగిన్ ద్వారా లేదా మన మిత్ర వాట్సాప్ నంబరు ద్వారా నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించింది. విద్యార్థులకు మంత్రి నారా లోకేశ్ 'ఆల్ ది బెస్ట్' చెప్పారు. కాగా ఈ నెల 17 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

గ్రూప్2 అభ్యర్థులకు హారిజంటల్ రిజర్వేషన్

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదల చేసిన గ్రూప్-2 మెయిన్స్ నోటిఫికేషన్‌లో మహిళలు, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి హారిజంటల్ రిజర్వేషన్ విధానం వర్తిస్తుందని ఏపీపీఎస్సీ సోమవారం ప్రకటించింది. సాధారణంగా అమలుచేసే వర్టికల్ రిజర్వేషన్‌లో భాగంగానే ఇది కూడా అమలవుతుందని తెలిపింది. హారిజంటల్ రిజర్వేషన్‌లో అర్హులైన మహిళా అభ్యర్థులు లేకపోతే ఆ పోస్టులను ప్రస్తుత నిబంధనల ప్రకారం భర్తీ చేస్తామంది.

గ్రూప్-2 వెబ్ ఆప్షన్లపై నిరుద్యోగ జేఏసీ హర్షం

విజయవాడ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): 'గ్రూప్-2 అభ్యర్థుల విన్నపాలను గౌరవించి వెబ్ ఆప్షన్లు పెట్టుకోమని తెలియజేయటం శుభ పరిణామం' అని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమంత్ కుమార్ సోమవారం హర్షం వ్యక్తంచేశారు. వైసీపీ ప్రభుత్వంలో నోటిఫికేషన్ల ఆలస్యం కారణంగా వేలమంది వయోపరిమితి కోల్పోయారని, వయోపరిమితి పెంచి నోటిఫికేషన్లు ఇచ్చి ఆదుకోవాలని ఆయన కోరారు.

దేవదాయశాఖ కమిషనర్‌గా రామచంద్రమోహన్ అర్హులే

▸ హైకోర్టు స్పష్టీకరణ

▸ పిటిషన్ కొట్టివేత.. 25 వేలు ఖర్చులు విధింపు

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టేందుకు అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్ అర్హులేనని హైకోర్టు తేల్చిచెప్పింది. మూడో వ్యక్తి ప్రోద్బలంతో పిటిషనర్ ప్రస్తుత వ్యాజ్యాన్ని దాఖలు చేశారని పేర్కొంది. కోర్టు విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారనేందుకు ఈ కేసు మంచి ఉదాహరణ అని తెలిపింది. వ్యాజ్యాన్ని కొట్టివేస్తూ పిటిషనర్ రమణమూర్తికి రూ.25వేలు ఖర్చులు విధించింది. ఈ సొమ్మును నాలుగు వారాల్లో ఏపీ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీకి చెల్లించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి ఫిబ్రవరి 28న తీర్పు ఇచ్చారు. సోమవారం తీర్పు ప్రతి అందుబాటులోకి వచ్చింది. దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్ అక్రమాలపై రాష్ట్ర విజిలెన్స్ విచారణ పూర్తయ్యేవరకు ఆయనను దేవదాయశాఖలో కొనసాగించకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ మచిలీపట్నానికి చెందిన



వీవీ రమణమూర్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దేవదాయశాఖ కమిషనర్‌గా రామచంద్రమోహన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ ఇచ్చిన ఉత్తర్వుల అమలును నిలుపుదల చేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల తుది విచారణ జరిపిన న్యాయమూర్తి నిర్ణయాన్ని వెల్లడించారు. 'దేవదాయ శాఖ చట్టంలోని సెక్షన్ 3, 4 ప్రకారం అడిషనల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వ్యక్తి కమిషనర్‌గా నియమితులయ్యేందుకు అర్హులు. చట్టంలోని సెక్షన్ 3(2) ప్రకారం హిందూ మతాన్ని ఆచరించనప్పుడు మాత్రమే కమిషనర్ పోస్టుకు అనర్హులు. వరాహల క్ష్మీనరసింహస్వామి దేవస్థానం, మన్సాస్ ట్రస్ట్ ఈవోగా అక్రమాలకు పాల్పడ్డారంటూ త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా రామచంద్రమోహన్‌ను గతంలో సస్పెండ్ చేశారని, హైకోర్టును ఆశ్రయించి మధ్యంతర ఉత్తర్వులు పొందడం ద్వారా తిరిగి విధుల్లో చేరారని పిటిషనర్ రమణమూర్తి వ్యాజ్యంలో పేర్కొన్నారు. 'ఇన్‌చార్జి కమిషనర్‌గా రామచంద్రమోహన్ ఏవిధంగా అనర్హుడో అఫిడవిట్‌లో పేర్కొనలేదు. మూడో వ్యక్తి ప్రోద్బలంతో పిటిషనర్ ప్రస్తుత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. కోర్టు విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను కొట్టివేస్తున్నాం' అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

ఈ నెలలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్

▸ పాఠశాల విద్యలో విప్లవాత్మక సంస్కరణలు

▸ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వర్క్‌షాప్‌లో లోకేశ్



ఏపీ విద్యావిధానంపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్, పాల్గొన్న ఎమ్మెల్యేలు కాల్వ శ్రీనివాసులు, సోమిరెడ్డి, పల్లా శ్రీనివాసరావు, కళా వెంకట్రావు, పరిటాల సునీత, మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్సీ అనురాధ తదితరులు

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో విప్లవాత్మక సంస్కరణలు తెస్తున్నట్టు మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ నెలలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఏపీ మోడల్ ఎడ్యుకేషన్, జీవో 117కు ప్రత్యామ్నాయం, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సోమవారం ఉండవల్లిలోని నివాసంలో వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యారంగంలో ఎలాంటి మార్పులు చేపడితే బాగుంటుందనే దానిపై వారి నుంచి అభిప్రాయాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి, దేశంలోనే ఏపీ విద్యా వ్యవస్థను నంబర్ 1 చేయాలన్న సీఎం చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా సంస్కరణలకు శ్రీకారం చుట్టామన్నారు. తాను యువగళం పాదయాత్ర చేస్తున్నప్పుడు జీవో 117 వల్ల కలిగిన దుష్ఫలితాల గురించి అనేక మంది తన దృష్టికి తెచ్చారని గుర్తుచేశారు. జీవో 117 పేరుతో వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో 12 లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారన్నారని, వారంతా ప్రైవేటు పాఠశాలల్లో చేరారని చెప్పారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నివేదిక ప్రకారం జాతీయ సగటుతో పోలిస్తే ఏపీ పాఠశాల విద్యలో ఎక్కువ అభ్యసన అంతరం ఏర్పడిందన్నారు. 3వ తరగతి విద్యార్థుల్లో.. భాషా సబ్జెక్టుల్లో 57శాతం మంది, గణితంలో 54శాతం మంది మాత్రమే అంచనా మేరకు మెరుగ్గా ఉన్నారన్నారు. ఇది జాతీయ సగటుతో పోలిస్తే 5 నుంచి 8శాతం తక్కువని చెప్పారు. పైతరగతుల్లో ఈ అంతరం ఇంకా ఎక్కువగా ఉందన్నారు. అసర్-2024 నివేదిక రాష్ట్రంలో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీలో లోపాలను బహిర్గతం చేసిందన్నారు. పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ నివేదిక ప్రకారం టీచర్ విద్య శిక్షణలో ఏపీ 60 పాయింట్లు సాధించిందన్నారు.

నియోజకవర్గానికో మోడల్ స్కూల్!

గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దేందుకు జీవో 117 రద్దుచేసి, ప్రత్యామ్నాయం తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. సీబీఎస్ఈపై విద్యార్థులకు మాక్ పరీక్ష నిర్వహిస్తే 90శాతం మంది ఫెయిల్ అయ్యారని తెలిపారు. ఐబీ సిలబస్ పేరుతో రూ.5 కోట్లు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. విద్యారంగంలో ఉత్తమ విధానాల అమలుకు టీచర్లను విదేశాలకు పంపుతామన్నారు. అంతర్జాతీయంగా వస్తున్న మార్పులపై కొందరు టీచర్లు పోలాండ్‌లో అధ్యయనం చేస్తారని తెలిపారు. దేశంలోనే అత్యున్నత ప్రమాణాలతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్స్, బెంచీలు, తాగునీరు, మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తామన్నారు. గంజాయి, డ్రగ్స్ నివారణకు 'డ్రగ్స్ వద్దు బ్రో' పేరుతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ నెలలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని మంత్రి వెల్లడించారు.

ప్రజాప్రతినిధుల సూచనలు ఇవీ..

ప్రభుత్వ పాఠశాలల్లో కనీస స్థాయిలో అయినా విద్యార్థుల సంఖ్య ఉంటే ఇబ్బందులుండవని, దీనికి ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలని కొణతాల రామకృష్ణ అన్నారు. శివారు ప్రాంతాలున్న గ్రామాల్లో విద్యార్థులకు రవాణా ఇబ్బంది లేకుండా చూడాలని బండారు సత్యనారాయణమూర్తి కోరారు. మోడల్ ప్రైమరీ స్కూల్‌కు కనీస విద్యార్థుల సంఖ్య 45 చేయాలని లోకం మాధవి సూచించారు. గురుకుల పాఠశాలలు పెంచాలని కొవ్వూరు ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లోని విద్యార్థులకు ఎంసెట్, ఐఐటీ కోచింగ్ నిర్వహించాలని కొండబాబు కోరారు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి సమగ్ర ప్రణాళిక అమలుచేయాలని కాల్వ శ్రీనివాసులు సూచించారు.

18 మీటర్ల లోపు ఎత్తు భవన నిర్మాణాలకు

స్వీయ ధ్రువీకరణ ఇస్తే సరి

▸ టౌన్‌ప్లానింగ్ అధికారుల అనుమతి అవసరం లేదు!

▸ భవన నిర్మాణదారులకు ఏపీ సర్కారు శుభవార్త

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణదారులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇకపై 18 మీటర్ల లోపు లేదా ఐదంతస్తుల లోపు భవన నిర్మాణ అనుమతులకు స్వీయ ధ్రువీకరణ పత్రం ఇస్తే సరిపోతుంది. టౌన్‌ప్లానింగ్ అధికారుల అనుమతి అవసరం లేకుండానే భవన నిర్మాణాలకు అనుమతి వస్తుంది. అయితే భవన యజమానులు రిజిస్టర్డ్ ఎల్‌టీపీలు, ఇంజనీర్లు లేదా ఆర్కిటెక్ట్‌ల సమక్షంలో సరైన పత్రాలు సమర్పించి అఫిడవిట్ ఇవ్వాలి. దీనికి సంబంధించి గత నెలలోనే భవన నిర్మాణ అనుమతులకు కొత్త విధానం అమల్లోకి తీసుకొస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసినప్పటికీ సాంకేతిక కారణాలతో జాప్యం జరిగింది. భవన నిర్మాణాల అనుమతుల ప్రక్రియను త్వరితగతిన జారీచేసేలా ఈ కొత్త విధానాన్ని సర్కార్ అందుబాటులోకి తీసుకొచ్చింది. సెల్ఫ్ సర్టిఫికేషన్ ద్వారా నిర్మాణాలకు అనుమతులిచ్చేందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను ఏపీడీపీఎంఎస్ పోర్టల్‌లోకి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఈ విధానం ఆమోదం పొందిన లేఅవుట్లు, గ్రామ కంఠం, సర్క్యులేషన్ ప్లాన్లు ఉన్న ప్రాంతాలు, 1985కు ముందు నిర్మించిన భవనాల పునర్నిర్మాణానికి ఉపయోగపడుతుందని మంత్రి చెప్పారు.

పర్చూరు ఓట్ల తొలగింపు కుట్రపై 'సిట్'

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో విజయం సాధించడానికి అక్రమ మార్గంలో ఓట్ల తొలగింపునకు పాల్పడిన వారి గుట్టు రట్టు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ నేతృత్వంలో గుంటూరు పశ్చిమ డీఎస్పీ అరవింద్‌తోపాటు మరికొందరు పోలీసుల్ని సభ్యులుగా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ హయాంలో బాపట్ల జిల్లా పర్చూరులో గుట్టు చప్పుడు కాకుండా 24 వేల మంది ఓటర్లకు సంబంధించి ఫారమ్ 7 ఇచ్చి ఓట్ల తొలగింపునకు ప్రయత్నించారు. అప్పటి ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కూటమిసర్కారుకి మరోసారి ఫిర్యాదు చేయగా పరిశీలించిన ప్రభుత్వం 'సిట్' ఏర్పాటు చేసింది.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ఆస్కార్ వేడుకలు.. అనోరాకు అగ్రస్థానం



ప్రపంచ సినీ రంగంలో ఉన్నత పురస్కారంగా భావించే 97వ ఆస్కార్ అవార్డుల వేడుక కన్నులపండువగా సాగింది. అమెరికాలోని లాస్‌ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో ఆదివారం సాయంత్రం (భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం) నిర్వహించిన ఈ కార్యక్రమానికి కానన్ ఓబ్రియాన్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆయన భారతీయులను ఉద్దేశించి హిందీలో మాట్లాడడంతో పాటు 'బ్రేక్ ఫాస్ట్ చేశారా' అని అనడం అందర్నీ ఆకట్టుకుంది.





ఈ వేడుకలో అందర్నీ ఆశ్చర్యపరిచిన చిత్రం 'అనోరా'. చిన్న చిత్రంగా తెరకెక్కిన ఈ సినిమా ఏకంగా ఐదు అకాడమీ అవార్డులను దక్కించుకుంది. ఉత్తమ చిత్రం, ఎడిటింగ్, స్క్రీన్ ప్లే, దర్శకుడు, నటి విభాగంలో పురస్కారాలు దక్కించుకుంది. దర్శకత్వంతో పాటు ఎడిటింగ్, స్క్రీన్ ప్లే అందించిన సీన్ బేకర్.. ఒకే చిత్రానికి నాలుగుసార్లు అవార్డు అందుకున్న మొదటి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. వాల్ట్ డిస్నీ గతంలో వేర్వేరు సినిమాల ద్వారా నాలుగు అవార్డులను అందుకున్న సంగతి తెలిసిందే. సీన్ బేకర్ ఈ అవార్డును వేశ్యలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ థియేటర్ల మనుగడను కాపాడాల్సిన అవసరాన్ని చెప్పారు.


ఉత్తమ నటుడిగా అడ్రియన్ బ్రాడీ

బ్రాడీ కార్బెట్ తెరకెక్కించిన 'ద బ్రూటలిస్ట్' చిత్రానికి గాను ఉత్తమ నటుడిగా అవార్డును అందుకున్నారు అడ్రియన్ బ్రాడీ. ఆయనకు ఇది రెండో ఆస్కార్ పురస్కారం. 2002లో రోమన్ పొలాన్‌స్కీ దర్శకత్వంలో తెరకెక్కిన 'పియానిస్ట్' అతి పిన్న వయస్కుడిగా తొలిసారి ఆస్కార్‌ను అందుకున్నారు. ఈ రెండు సినిమాలు హోలోకాస్ట్ నేపథ్యంలో రూపొందినవే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధించిన విజయాలు, ఘనతలు శాశ్వతం కాదని తెలిపారు. అలాగే, 'ద రియల్ పెయిన్' చిత్రానికి గాను ఉత్తమ సహాయ నటుడిగా అవార్డును అందుకున్నారు కీరన్‌కైల్ కల్కిన్.

ఉత్తమ నటిగా మైకీ మ్యాడిసన్

'అనోరా' చిత్రానికి ఉత్తమ నటిగా పురస్కారం అందుకున్నారు మైకీ మ్యాడిసన్. ఈ రొమాంటిక్ కామెడీ డ్రామాలో ఆమె వేశ్య పాత్రలో నటించారు. ఈ అవార్డును అందుకోవడం కలలా ఉందని మ్యాడిసన్ చెప్పారు. అలాగే, 'ఎమిలియా పెరెజ్' చిత్రానికి గాను ఉత్తమ సహాయ నటిగా జో సాల్దాన అవార్డును అందుకున్నారు. అత్యధిక నామినేషన్లతో రేసులో నిలిచిన నాన్ ఇంగ్లీష్ చిత్రం 'ఎమీలియా పెరెజ్' కేవలం రెండు అవార్డులతో సరిపెట్టుకుంది. పది నామినేషన్లు సాధించిన 'బ్రూటలిస్ట్' చిత్రం మూడు అవార్డులు పొందింది. 'డ్యూన్ 2' చిత్రం రెండు అవార్డులను సొంతం చేసుకుంది.

ఆస్కార్ బృందంలో తెలంగాణ వాసి పాత్ర



ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్‌లో పురస్కారం పొందిన 'డ్యూన్ 2' చిత్రం వీఎఫ్ఎక్స్ టీమ్‌లో తెలంగాణ వాసి ఉండడం విశేషం. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మునిసిపాలిటీ అమినాపురంకు చెందిన ఎడ్ల సుమంత్‌రెడ్డి ఈ చిత్రానికి ఆరు క్యారెక్టర్లను డిజైన్ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

కేసముద్రం (ఆంధ్రజ్యోతి)

విజేతల వివరాలు

ఉత్తమ చిత్రం: అనోరా
ఉత్తమ దర్శకుడు: సీన్ బేకర్ (అనోరా)
ఉత్తమ నటుడు: అడ్రియన్ బ్రాడీ (ద బ్రూటలిస్ట్)
ఉత్తమ నటి: మైకీ మ్యాడిసన్(అనోరా)
ఉత్తమ సహాయ నటుడు: కీరన్‌కైల్ కల్కిన్ (ద రియల్ పెయిన్)
ఉత్తమ సహాయ నటి: జో సాల్దాన (ఎమిలియా పెరెజ్)
ఉత్తమ ఎడిటింగ్ : అనోరా (సీన్ బేకర్)
ఉత్తమ సినిమాటోగ్రఫీ: ద బ్రూటలిస్ట్ (లాల్ క్రాలే)

అనూజకు నిరాశ

భారత్ తరఫున ఆస్కార్ నామినేషన్ పొందిన లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ 'అనూజ' చిత్రానికి నిరాశ ఎదురైంది. ఈ విభాగంలో పోటీపడుతున్న చిత్రాలను ఓడించి, 'ఐ యామ్ నాట్ ఏ రోబో' లఘు చిత్రం పురస్కారాన్ని కైవసం చేసుకుంది.

ఉర్దూ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు (విద్య), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉర్దూ గురుకుల పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.సాంబశివరావు సోమవారం తెలిపారు. పాఠశాల స్థాయిలో 5, 6, 7 ,8 తరగతిలో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, డిగ్రీ మొదటి సంవత్సరాల్లో ప్రవేశానికి ఏప్రిల్ 25వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు ఏపీఆర్జేసీ సెట్ పరీక్ష ద్వారా అడ్మిషన్లు పొందాలని సూచించారు. కోస్తా ఆంధ్రలో ఉన్న ముస్లిం విద్యార్థులు ప్రవేశ పరీక్ష కోసం ఏపీ ఆర్ఎస్ సొసైటీ వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం 8712625073, 9652569140 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

పౌర్ణమికి అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు

గుంటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షణకు భక్తుల కోసం ఆర్టీసీ స్పెషల్ హైటెక్ 2+2 పుష్ బ్యాక్ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 12న రాత్రి 9.15 గంటలకు బయల్దేరి 13వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్‌టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి అక్కడే బస చేసి 14న పౌర్ణమి రోజున అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. అదే రోజున అరుణచలేశ్వరుని దర్శించుకొని సాయంత్రం బయల్దేరి 15వ తేదీన ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. 96164 సర్వీసుకు ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కోచార్జి రూ.2,420 మాత్రమేనని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 7382897459, 7382896403 సంప్రదించాలని కోరారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 527.80 అడుగులు ఉంది. ఇది 163.88 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7033 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8807 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 31,850 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 49,770 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 39,109 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

‘యూత్ పార్లమెంట్’లో భాగస్వామ్యం కావాలి

- ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): భారతదేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ వారి ఆదేశాల మేరకు జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ కార్యక్రమ పోస్టర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మేధాశక్తిని ఉపయోగించి ప్రపంచంలో కెల్లా మన దేశాన్ని ప్రథమ స్థానంలో ఉంచేలా కృషి చేయాలనీ, అందులో భాగంగానే యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని సూచించారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య డి.దివ్య తేజోమూర్తి మాట్లాడుతూ జిల్లా స్థాయి నోడల్ అధికారులుగా జాతీయ సేవా పథకం జిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూత్ అధికారి కిరణ్మయి దేవిరెడ్డిలను ప్రభుత్వం నియమించినట్లు చెప్పారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి 18 నుంచి 25 ఏళ్ల వయస్సు కలిగిన వారు ఎవరైనా ఈ యూత్ పార్లమెంట్ పోటీలలో పాల్గొనవచ్చని, ముందుగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మై భారత్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అనంతరం ఒక నిమిషం నిడివి కలిగిన "వాట్ డజ్ వికసిత్ భారత్ మీన్ టూ యూ" అనే అంశంపై వీడియో చేసి మార్చి 9వ తేదీలోపు మై భారత్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని తెలియజేశారు. తరువాత స్క్రీనింగ్ చేసి జిల్లా స్థాయిలో ఎంపిక జరుగుతుందనీ, ఈ గొప్ప అవకాశాన్ని యువత అందరూ తప్పనిసరిగా వినియోగించుకుని దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఓఎస్డి ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవి కుమార్ ఈ కార్యక్రమం విశిష్టతను వివరించారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న పాల్‌కుమార్, కోటేశ్వరమ్మ, చైర్మన్ శేషగిరిరావు

నరసరావుపేట టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర కళాశాలల మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ప్రారంభం అయ్యాయి. పోటీలను ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పీపీఎస్ పాల్‌కుమార్, టైనీటాట్స్ స్కూల్ అధినేత పాతూరి కోటేశ్వరమ్మ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్లకి బానిసలు అవుతున్నారనీ, ఆటపాటలకు దూరంగా ఉంటున్నారని అన్నారు. మొబైల్‌కి దూరంగా ఉంటూ ఆటలు, చదువులో ముందుండాలని అన్నారు. మహిళలు చదువుతోపాటు అన్ని రంగాలలో ముందుండాలని సూచించారు. ఏఎన్‌యూ అంతర కళాశాల మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంఏఎం ఫార్మసీ కళాశాల ఆతిథ్యం ఇస్తుందని చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు తెలిపారు. కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య మాట్లాడుతూ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు కరైకుడిలోని అల్గప్ప యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా మహిళల అంతర విశ్వవిద్యాలయాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. పోటీలలో ఆరేపల్లి ముప్పాళ్ళ ధనలక్ష్మి కాలేజి ఆఫ్ ఎడ్యుకేషన్, కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కాలేజి, నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల, ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్, తెనాలి జేఎంజే జట్లు పాల్గొంటున్నాయి. పోటీలకు సెలక్షన్ కమిటీ సభ్యులుగా డాక్టర్ సీహెచ్ వెంకటరావు, జె.ప్రేమ్‌కుమార్, ఈదర ఆదిబాబు, డాక్టర్ అరుణ సుజాత వ్యవహరిస్తున్నారు. నాకౌట్ మ్యాచ్‌లలో జరిగిన పోటీలలో నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల, లీగ్ మ్యాచ్‌లో ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్స్ విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రసాదరావు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామారావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలు మంగళవారంతో ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

ధ్రువీకరణ పత్రం... నకిలీ సిత్రం

(5వ పేజీ తరువాయి)



తహసీల్దార్ స్టాంప్ పైన ఉండాల్సిన సంతకం అర్థం కాకుండా స్టాంప్‌లో కలసిపోయేలా గీతలు గీసిన సంతకం, స్టాంప్ కూడా పెద్ద సైజులో ఉండాల్సి ఉంటే, చిన్నది తయారు చేయించి వేసిన చిత్రం

మధ్యలో ఉన్న కొద్ది రోజుల్లో అధికారిక స్టాంపులతో దోచిపెట్టారా! అనేది అర్థంకాని విషయం. సాధారణంగా జగనన్న కాలనీల్లో భూములు ఇవ్వాలంటే పేదలయి ఉండాలి. కానీ ఇక్కడ కొన్ని సంస్థల పేరుపెట్టి కొందరు వ్యక్తులు భూములను నొక్కేశారు. సామాన్యుడికి పట్టణ ప్రాంతాల్లో కేవలం ఒక్క సెంటు భూమి మాత్రమే అప్పటి జగన్ సర్కారు ఇస్తే, వీరు రెండు నుంచి ఐదు సెంట్ల వరకు తీసుకున్నారు. అయితే పేదలకు కేటాయించిన ప్లాట్లలో అయితే ఆధార్ వంటి అన్ని పత్రాలు అప్‌లోడ్ చెయ్యాల్సిన పరిస్థితి ఉండటం, సంస్థలకు వీటిలో ఇచ్చే అవకాశం లేకపోవటంతో ఒక్కో కాలనీలో ఇళ్ల కేటాయించిన లబ్ధిదారుల భవిష్యత్ అవసరాలు, పార్క్, ఆట స్థలాల వంటివాటి కోసం కేటాయించిన కమ్యూనల్ స్థలాలను టార్గెట్‌గా చేసుకుని ఈ నకిలీ పత్రాలతో ఆక్రమించేశారు.

ధ్రువీకరణ పత్రాలతో పన్నుల చెల్లింపు

ఒక భూమిపై హక్కు పొందాలంటే ప్రభుత్వం అధికారికంగా అందించిన పట్టా ఉండాలి. లేక నివేశన స్థల ధ్రువపత్రం కానీ, పట్టా కానీ ఉండాలి. కానీ ఇక్కడ నకిలీ ధ్రువీకరణ పత్రాలు పుట్టుకొచ్చాయి. పెదరావూరు లేఔట్‌లో కమ్యూనల్ స్థలాన్ని ఆక్రమించి ఉండటం గుర్తించిన రెవెన్యూ అధికారులు వారిదగ్గరున్న పట్టాను చూపాలని కోరటం, రెండు ప్రయివేటు సంఘాల పేరుతో స్థలాలు పొందినట్టు ధ్రువపత్రాలు చూపటంతో వాటిని పరిశీలిస్తే అవి నకిలీవని తేలింది. అయితే ఇదే తరహాలో తాజాగా ఒక ప్రైవేటు స్థలానికి, మండల పరిధిలోని మరికొన్ని ప్రభుత్వ స్థలాలకు ఇదేతరహా పత్రాలను చూపి పన్నులు చెల్లించనట్టు సమాచారం అందటంతో అధికారులు వీటిపై దృష్టిపెట్టారు. మండలంలో ఎక్కడెక్కడ ఎంత మేర ప్రభుత్వ భూములను ఆక్రమించారో తెలుసుకునే పనిలో పడ్డారు. ఇంతటి వ్యవహారంలో రెవెన్యూ సిబ్బంది సహకారం లేకుండా జరిగే అవకాశం తక్కువ. అయితే దీనికి సహకరించింది ఎవరు? ఇంకా ఎంతమందికి! ఎన్ని రూ. కోట్ల విలువైన స్థలాలను అప్పగించేశారనేది తేలాల్సిఉంది. దీనిపై వివరణ అడిగేందుకు ప్రయత్నిస్తే రెవెన్యూ అధికారులు అందుబాటులో లేరు. అధికారికంగా చెప్పకున్నా, ఈ నకిలీల వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసే ఆలోచనలో ఉన్నారని మాత్రం సమాచారం.

పట్టభద్రుల పోరులో.. కూటమి దూకుడు

(5వ పేజీ తరువాయి)

రౌండ్‌లోనూ ఆలపాటి హవా కొనసాగింది. ఈ రౌండ్‌లో ఆలపాటికి 16,722 ఓట్లు రాగా, లక్ష్మణరావుకు 7404 ఓట్లు వచ్చాయి. 2978 ఓట్లు చెల్లుబాటు కాలేదు. నాల్గో రౌండ్‌లో ఆలపాటికి 16236 ఓట్లు, లక్ష్మణరావుకు 7828 ఓట్లు రాగా 3035 ఓట్లు చెల్లుబాటు కాలేదు. ఐదో రౌండ్‌లో ఆలపాటికి 16916, లక్ష్మణరావుకు 7535 ఓట్లు రాగా 2800 ఓట్లు చెల్లుబాటు కాకుండా పోయాయి. దీంతో ఐదో రౌండ్ ముగిసేసరికి ఆలపాటి మెజార్టీ 47,872కి చేరింది.

తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాదు తన రాజకీయ అనుభవాన్ని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రంగరించారు. ఎవరూ ఊహించనంతగా తొలి ప్రాధాన్య ఓట్లు తనకు వేసేలా పట్టభద్రుల్లో చైతన్యం నింపారు. ఏ బ్యాలెట్ బాక్సు తెరిచి ఓట్ల లెక్కింపు ప్రారంభించినా కౌంటింగ్ హాల్ అంతా ఆలపాటి పేరే వినిపించింది. తొలి రౌండ్ ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేసరికే దాదాపుగా 10 వేల మెజార్టీ లభించడంతో అక్కడే రాజా విజయం ఏ స్థాయిలో ఉండబోతుందో చెప్పకనే చెప్పినట్లు అయింది. అది మొదలుకొని ప్రతీ రౌండ్‌లోనూ ఆయన హవా కొనసాగింది. నాల్గో రౌండ్ కౌంటింగ్ ముగిసేసరికే ఆలపాటికి సమీప ప్రత్యర్థి అయిన సిట్టింగ్ పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కౌంటింగ్ హాల్‌ని విడిచి వెళ్లిపోయారు.

పక్కా ప్రణాళికతో ఓట్ల లెక్కింపు

ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొన్నారు. ఎన్నికల నిర్వహణలో పక్కా ప్రణాళికతో ముందుకెళ్లారు. ఎలక్షన్ షెడ్యూల్ వెలువడిన రోజు నుంచి కోడ్‌ని పకడ్బందీగా అమలు చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులతో సమావేశాలు నిర్వహించి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. మరోవైపు పోలింగ్, ఓట్ల లెక్కింపునకు సిబ్బందిని నియమించి వారికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇప్పించారు. ఎక్కడా ఎలాంటి అస్పష్టతకు తావు లేకుండా ఎన్నికలనడు నిర్వహించారు. గత ఎన్నికల్లో కంటే ఈ దఫా లక్ష ఓట్లు అధికంగా పోలింగ్ అయ్యాయి. అయినప్పటికీ ఫలితం ముందుగానే వెలువడేలా చేశారు. కౌంటింగ్ హాల్ విశాలంగా ఉండటంతో నాలుగు వరసల్లో ఏడు టేబుళ్ల చొప్పున 28 కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేయించారు. ఇది ఓట్ల లెక్కింపుని సులభతరం చేసింది.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్జీవో కాలనీ 5వ లైన్‌లో జొన్నలగడ్డ శ్యాంప్రసాద్ ముఖర్జీ (54) అనే వ్యక్తి జామ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడు శ్యాంప్రసాద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే మద్యానికి బానిసై ఏ పని చేయకుండా తిరుగుతుండడంతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి ఐదేళ్లుగా వేర్వేరుగా ఉంటున్నారు. శ్యాం ప్రసాద్‌కు ఇద్దరు సోదరులు ఉన్నారు. అన్న విదేశాల్లో ఉండగా తమ్ముడు వసంతరాయపురంలో ఉంటాడు. తన తండ్రికి చెందిన పాడుపడిన ఇంటిలో శ్యాంప్రసాద్ ఒక్కరే ఒంటరిగా ఉంటున్నాడు. భార్య, పిల్లలు దూరం కావడం, ఏ పని చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. అన్నదమ్ములకు జాయింట్‌గా ఉన్న ఇంటిని విక్రయించాలంటే సోదరుడు విదేశాల్లో ఉండడంతో సాధ్యం కాలేదు. మనస్తాపానికి గురైన శ్యాంప్రసాద్ జామచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు

విశ్రాంత పోలీస్ అధికారి పృథ్వీనారాయణ హఠాన్మరణం



పృథ్వీ నారాయణ (ఫైల్)

గుంటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఏఎస్పీ బి.పృథ్వీనారాయణ (77) హఠాన్మరణం చెందారు. అమెరికాలో గుండెపోటుతో సోమవారం మధ్యాహ్నం కన్నుమూశారు. పోలీస్ శాఖలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పృథ్వీనారాయణ అత్యంత ధైర్య సాహసాలతో విధులు నిర్వహిస్తూ ముందుకు సాగారు. ఈ క్రమంలో ఆయన తీసుకున్న పలు నిర్ణయాలు వివాదాస్పదమైనప్పటికీ వెనక్కు తగ్గలేదు. తాను పనిచేసిన ప్రతి చోట రౌడీ షీటర్లు, దొంగలు, ఫ్యాక్షనిస్టులు, ఈవ్‌టీజర్లపై కఠిన వైఖరి అవలంబించి శాంతి భద్రతలు కాపాడారు. విజయవాడకు చెందిన పృథ్వీనారాయణ 1974లో ఎస్సైగా పోలీస్ శాఖలో చేరారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఆయన ఎస్సైగా, సీఐగా, డీఎస్పీగా సుదీర్ఘకాలం సేవలందించారు. గుంటూరు, నరసరావుపేట, తెనాలి తదితర సబ్ డివిజన్ల పరిధిలో ఆయన ఎస్ఐగా, సీఐగా, డీఎస్పీగా పని చేశారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇద్దరికి వివాహాలయ్యాయి. వారు ప్రస్తుతం అమెరికాలో స్థిరపడ్డారు. ఐదు నెలల క్రితం పృథ్వీనారాయణ, లీల దంపతులు అమెరికాలో పిల్లల వద్దకు వెళ్లారు. అక్కడ వారి వద్ద ఉండగా సోమవారం మధ్యాహ్నం ఆయనకు గుండెపోటు రావడంతో కన్నుమూశారు.

పలువురి సంతాపం

విశ్రాంత ఏఎస్పీ పృథ్వీనారాయణ ఆకస్మిక మరణం పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎం మాలకొండయ్య, కాళహస్తి సత్యనారాయణ, జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు, న్యాయవాది బండి రామ్మూర్తి నాయుడు, విశ్రాంత డీఎస్పీ కేవీ నారాయణ, బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ సంతాపం వ్యక్తం చేశారు.

కొత్త థెరపీల అభివృద్ధికి దోహదం



మాట్లాడుతున్న ఆచార్య అప్పారావు

గుంటూరు (విద్య), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): క్రిస్పర్, క్యాస్9 సాంకేతికత ద్వారా జీనోమ్‌లో నిర్దిష్ట మార్పులు, జన్యుపరమైన రుగ్మతలను సరిదిద్దడం, వ్యవసాయంలో అధిక దిగుబడులు పొందడం, కొత్త థెరపీల అభివృద్ధికి విస్తృతంగా ఉపయోగపడుతుందని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ మాజీ వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ పొదిలి అప్పారావు అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో సైన్స్ అకాడమీస్ లెక్చర్ వర్క్‌షాప్ ఆన్ రీసెంట్ ట్రెండ్స్ ఇన్ మోలిక్యులర్ బయోలజీ అండ్ బయోటెక్నాలజీ అనే అంశంపై సోమవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ఆచార్య అప్పారావు మాట్లాడుతూ ప్లాంట్ మైక్రోబియోమ్ అనేది ఒక మొక్క చుట్టూ, దాని లోపల నివసించే సూక్ష్మజీవుల (బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, వైరస్‌లు, ఇతర మైక్రో ఆర్గానిజం) సమూహమని, ఈ సూక్ష్మజీవులు మొక్కల పెరుగుదల, వ్యాధి నిరోధకత, భూసార వృద్ధికి ఎంతో సహాయపడతాయని వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితిలో ప్లాంట్ మైక్రోబియోమ్‌పై పరిశోధనలు విస్తృతంగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్లాంట్ సైన్సెస్ హెడ్ ప్రొఫెసర్ రాజగోపాల్ సుబ్రమణ్యం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ పి.కొండయ్య, ప్రొఫెసర్, వర్క్‌షాప్ కన్వీనర్ ఆగేపాటి ఎస్.రాఘవేంద్రరావు, విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నింటికీ మూలం రసాయన శాస్త్రం

పెదకాకాని, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన శాస్త్రాలన్నింటికీ మూల శాస్త్రం రసాయన శాస్త్రం అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీలోని రసాయన శాస్త్ర విభాగంలో రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సును సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. గంగాధరరావు మాట్లాడుతూ వర్తమాన కాలంలో మానవ వైద్యం నిమిత్తం ఉపయోగిస్తున్న అనేక రకాల మందులు, ఎన్నో రకాల టీకాలు, ఔషధాల్లో రసాయన శాస్త్రమే కీలక పాత్ర వహిస్తుందని తెలిపారు. వ్యవసాయ రంగంలో పురుగుమందులు, ఎరువుల తయారీ రసాయన శాస్త్రాన్ని అనుసరించే జరుగుతాయని తెలియజేశారు. టాంజానియాలోని దోడామ యూనివర్సిటీకి చెందిన ఆచార్య ఎస్‌బీ నంబూరి మాట్లాడుతూ రసాయన శాస్త్రం మానవ జీవన విధానంలో ఎలా సమ్మిళితం అయిందో వివరించారు. ఆచార్య ఎం.సుబ్బారావు సంచాలకులుగా నిర్వహించిన ఈ సదస్సుకు ఆచార్య దిట్ట కవి రామచంద్రన్ అధ్యక్షత వహించారు. సదస్సులో ఏఎన్‌యూ తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, వర్సిటీ ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, సైన్స్ కళాశాల ప్రాచార్యులు ఆచార్య వీరయ్య, దూరవిద్య కేంద్ర సంచాలకులు ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, ఆచార్య ఎం.త్రిమూర్తిరావు, ఆచార్య ఆర్ శ్రీనివాసరావు, సత్యనారాయణ, ఆచార్య పి.పద్మావతి, రసాయన శాస్త్ర విభాగ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గొట్టిపాడు కాశీ విశ్వేశ్వరాలయంలో చోరీ

- రూ.9 లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాల అపహరణ



కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో తొలగించిన తలుపు నుంచి వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

ప్రత్తిపాడు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొట్టిపాడు కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు 9 లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. దేవాలయానికి పటిష్టంగా రెండు వైపులా ఇనుప తలుపులతో పాటు ప్రధాన ద్వారాలు ఉన్నాయి. ఆ తరువాత గర్భగుడికి కూడా ఇనుప గేటుతో తాళం వేసి ఉంటుంది. ఈ రెండు గేట్లను దాటుకుని దుండగులు గర్భగుడిలోకి ప్రవేశించి అమ్మవారి మూడు కేజీల వెండి నాగాభరణంతో పాటు అమ్మవారి బంగారు తాళిబొట్టు, గొలుసు, బొట్టు, బులాకీలను అపహరించుకు పోయారు. వీటి విలువ సుమారు రూ. 9 లక్షలు ఉంటుందని ఆలయ అర్చకుడు బాబు తెలిపారు. ఆలయ అర్చకునితోపాటు 35 మంది భక్తులు శివ మాల ధరించి ఆదివారం రాత్రి శ్రీశైలం వెళ్లారు. ఆదివారం రాత్రి పూజారి భార్య తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. ఒక్కరే ఈ చోరీ చేసినట్లు ఆలయంలోని సీసీ ఫుటేజిలో కన్పిస్తుంది. అయితే వచ్చిన దొంగ చేతికి గ్లౌజులు ధరించి ఉన్నాడు. ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు.

గంజాయి విక్రేత అరెస్టు



నిందితుని వివరాలు వెల్లడిస్తున్న సీఐ కల్యాణ్‌రాజు

తాడేపల్లి టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని సోమవారం తాడేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. సీఐ కల్యాణ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం పట్టణ పరిధిలోని సీతానగరం పరిసర ప్రాంతాల్లో గంజాయి అమ్ముతున్నారన్న సమాచారంతో నిఘా పెట్టారు.

ఇందులో భాగంగా రైల్వే వంతెన వద్ద ముగ్గురు వ్యక్తులు గంజాయి అమ్ముతుండగా పట్టుకునే క్రమంలో ఇద్దరు పారిపోగా విజయవాడ విద్యాధరపురంకు చెందిన గుమ్మడి సాయికుమార్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఒక కేజీ 150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. కాగా విజయవాడకు చెందిన కోటి, మహేష్ అనే వారిని పట్టుకుంటామని తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	104, 112, 123
చికెన్ విత్ స్కిన్	200.00
చికెన్ స్కిన్ లెస్	210.00

1,55,229 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,82,384 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,55,229 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 71,945 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. కాగా సోమవారం 341 వెరైటీ మిర్చి ఈ సీజన్‌లో తొలిసారిగా క్వింటాల్ రూ. 15 వేల ధరకు అమ్ముడైంది.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	13900
నంబరు. 5	10500	14500
273	10000	13000
341	10500	15000
4884	9000	13000
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10500	14000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	11500	13000
బ్యాడిగి 355	10500	13500
సింజెంటా		
బ్యాడిగి 5531	10000	12500
ఎన్ఎస్ 250		
బుల్లెట్	--	--
దేవనూరు డీలక్స్	12500	13500
ఆర్మూరు	10000	11500
తాలుకాయలు	5000	7500

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 30.93 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని ఆయన తెలిపారు.

పరీక్షా సామగ్రి అందజేత

మాచర్ల రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎత్తిపోతల గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు రోటరీక్లబ్ ఆధ్వర్యాన పరీక్షా సామగ్రిని అందించారు. రోటరీక్లబ్ డిప్యూటి గవర్నర్ డాక్టర్ కొండవీటి రామకోటయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇష్టంతో చదివితే అద్భుత విజయాలు సాధించవచ్చనిఅన్నారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ నిమ్మగడ్డ సురేఖ, ట్రెజరర్ అన్నపురెడ్డి లక్ష్మి, పఠాన్ నాగూర్‌వలి, సత్యప్రసాద్, కూరపాటి శివ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

మాచర్లటౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో పట్టణంలోని పారిశుధ్య పనులను సోమవారం మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుధ్య పనులపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

దాచేపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : దాచేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. సీసీ కెమెరాల నిఘాలో జరిగిన పరీక్షలకు 392 మంది విద్యార్థులు హాజరు కావాల్సిన ఉండగా 386 మంది పరీక్షలు రాశారు. ఆరుగురు గైర్హాజరయ్యారు. ఈ కళాశాలలో సీసీ కెమేరా నిఘా, పోలీసుల బందోబస్తుతో పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి.

బెల్లంకొండ, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్ర మైన బెల్లంకొండ జూనియర్ కళాశాలలో సోమవారం రెండవ సంవత్సర ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు 122 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరైనట్టు ప్రిన్సిపాల్ బత్తుల ఉమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్టు తెలిపారు.

ఏరియా ఆస్పత్రిలో అన్నదానం

సత్తెనపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : డొక్కా సీతమ్మ అన్న ప్రసాదు వితరణలో భాగంగా జనసేన నేత అప్పాపురపు నరేంద్ర ఆధ్వర్యంలో నల్లూరి ఇషాన్ పుట్టిన రోజు సందర్భంగా వారి తల్లిదండ్రులు నరేష్, సుజాతల ఆర్థిక సాయంతో మంగళవారం ఏరియా వైద్యశాలలో 120 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంవో శోభారాణి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధా, ఏ ప్రవీణ్, ఫిజియో థెరపిస్టు జీవన జ్యోతి, దివ్వెల శ్రీనివాసరావు, జీ వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

9న మెగా వైద్యశిబిరం

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి) గాయత్రి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండల పరిధిలోని పొందుగల గ్రామంలో ఈనెల 9న ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 9959850838కు సంప్రదించాలని తెలిపారు.

మహాశివరాత్రి ఆదాయం

రూ.45.51 లక్షలు

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి) మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు బాల చాముండికా సమేత అమరేశ్వరస్వామి వారికి వివిధ రూపాలలో రూ45,50,755 ఆదాయం లభించింది. సోమవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన హుండీల లెక్కింపులో రూ. 28,61,262, దర్శనపు టికెట్లు, ఇతర సేవల ద్వారా రూ. 15,87,786, కల్యాణ చదివింపుల ద్వారా రూ. 1,707 ఆదాయం లభించినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో పి. సునీల్‌కుమార్ తెలిపారు. పెదకూరపాడు గ్రూప్ టెంపుల్స్ ఈవో సత్యనారాయణ రెడ్డి పర్యవేక్షణలో హుండీల లెక్కింపు జరిగింది. కార్యక్రమంలో ఎస్‌బిఐ ధరణికోట, తెనాలి, గుంటూరు సేవాసమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌లో అర్హత

దుర్గి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌లో అర్హత సాధించారని ప్రిన్సిపాల్ బాలస్వామి తెలిపారు. 2024- 25 సంవత్సరానికి గాను ఎన్‌ఎంఎంఎస్‌లో జిల్లా, రాష్ట్రస్థాయిలో తమ విద్యార్థులు ముందజలో ఉన్నారన్నారు. ఈ విద్యార్థులు ఒక్కొక్కరికి యేడాదికి రూ. 12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు జాతీయ ప్రతిభ స్కాలర్‌షిప్ వస్తుందన్నారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళ పట్ల అసభ్య ప్రవర్తన

సత్తెనపల్లి రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కర్నూలు ప్రాంతం నుంచి మండలంలోని ఒక గ్రామానికి వ్యవసాయ కూలీలు మిర్చి కోతలకు వలస వచ్చారు. రోజు వారిలాగే సోమవారం కూడా మిర్చి కోసేందుకు పొలం వెళ్ళారు. పని ప్రారంభమయ్యాక మిర్చి కోస్తున్న మహిళ పట్ల రైతు అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని గమనించిన బంధువులు, తోటి కూలీలు రైతుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోమవారం రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కూలీల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ట్రాక్టర్ గుర్తింపు

సత్తెనపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఫిబ్రవరి 26న పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను పట్టణ పోలీసులు గుర్తించారు. ట్రాక్టరు పొన్నూరుకు చెందినదిగా గుర్తించారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.

బ్లాస్టింగ్‌లతో భయం భయంగా..!

- శబ్దాలకు ఇంటి గోడలకు పగుళ్లు
- భయాందోళనలో పెదగార్లపాడు గ్రామస్థులు
- అధికారులకు పలుమార్లు వినతులు..
- ఫ్యాక్టరీ యాజమాన్యం పట్టించుకోని వైనం
- కాలనీ ఖాళీ చేసి వెళ్లడమే తరువాయి..



పెదగార్లపాడులోని బీసీ కాలనీ నివాస గృహాలు, బ్లాస్టింగ్‌లో పగుళ్లిచ్చిన గోడలు

పెదగార్లపాడు(దాచేపల్లి), మార్చి3 (ఆంధ్రజ్యోతి): 'గ్రామానికి ఫ్యాక్టరీలు వస్తే మా పిల్లలకు ఉద్యోగాలొస్తాయి... మా జీవితాల్లోకి వెలుగులు వస్తాయి.. చదువుకున్న వారికి ఉద్యోగాలు.. కాయ కష్టం చేసే వారికి పనులు లభిస్తాయ'ని ఫ్యాక్టరీలకు భూములు ఇచ్చామని దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామంలోని బీసీ కాలనీ వాసులు చెబుతున్నారు. ఫ్యాక్టరీ నిర్మాణం చేపడితే గ్రామాల్లో తాగునీరు, రహదారుల నిర్మాణం, పాఠశాలల అభివృద్ధి జరుగుతుందని చెబితే విని సంతోషించాం అని అంటున్నారు. ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తిచేసుకొని ఉత్పత్తులు ప్రారంభించిన తర్వాత గ్రామానికి సమీపంలో మైనింగ్


ఇంటి గోడ నిలువుగా పగిలిన దృశ్యం

క్వారీలో జరుగుతున్న భారీ బ్లాస్టింగ్‌తో గోడలు పగుళ్లు ఏర్పడి నివాస గృహాలు దెబ్బతింటున్నాయనీ, గ్రామ అభివృద్ధి జాడేమో తెలియదు కాని ఇళ్లు ఖాళీ చేసే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

కాలనీవాసుల సమస్యల పట్ల ఫ్యాక్టరీ యాజమాన్యం చిన్నచూపు

ఈ కాలనీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన 200లకు పైగా నిరుపేద కుటుంబాల వారు ప్రభుత్వం కట్టించిన ఇళ్లల్లో నివాసం ఉంటూ వ్యవసాయ, కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తుంటారు. ఐదు సంవత్సరాల క్రితం గ్రామ సమీపంలో చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మించారు. ఉత్పత్తులు కూడా ప్రారంభించారు. గ్రామానికి దగ్గరలో మైనింగ్ క్వారీలో భారీ బ్లాస్టింగ్ నిర్వహిస్తున్నారు. ఫలితంగా ఇళ్లు కదిలి పోతున్నాయి. భూగర్భజలాలు రంగు, రుచి మారిపోతున్నాయి. బ్లాస్టింగ్‌ల వలన తమకు జరుగుతున్న నష్టాన్నిగురించి తెలియజేసేందుకు పలుమార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులను కలిసి విన్నవించాం. ఫ్యాక్టరీ యాజమాన్యానికి కూడా వివరించాం. కానీ తమ గోడు పట్టించుకొనే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోకపోతే కాలనీని ఖాళీ చేసే పరిస్థితి రావొచ్చని అంటున్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం మాత్రం కాలనీవాసుల సమస్యల పట్ల ఎంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటం, తమను మరింత బాధకు గురిచేస్తోందని కాలనీ చెందిన పలువురు ఆవేదన చెందుతున్నారు.

తాగు నీరు రంగు మారుతోంది..



మైనింగ్ క్వారీలో జరుగుతున్న భారీ బ్లాస్టింగ్‌తో క్వారీ పక్కనే ఉన్న తాగు నీటి బోర్లు రంగు రుచి మారుతున్నాయి. ఈ నీరు తాగితే శరీరం పై దురదలు రావటం, మచ్చలు ఏర్పడటం జరుగుతుంది. ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చయించుకోవాలంటే ఆర్థిక స్థోమతలు లేక తెలిసిన ఆకు పసర్లతో సరి పెట్టుకుంటున్నాం. ఫ్యాక్టరీ వల్ల మాకు కష్టాలు వస్తున్నాయి.

\- షేక్ మస్తాన్, పెదగార్లపాడు కాలనీ వాసి

మా ఇళ్ళు దెబ్బతింటున్నాయి



ప్రభుత్వ ఆర్థిక సహకారంతో ఇళ్ళు నిర్మించు కున్నాం. ఫ్యాక్టరీ వారు జరిపే భారీ బ్లాస్టింగ్‌తో మా ఇళ్లకు పగుళ్ళు ఏర్పడుతున్నాయి. ఎప్పుడు కూలి పోతాయోనని భయాందోళనలకు గురవుతున్నాం. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

\- పఠాన్ హసీనా, పెదగార్లపాడు కాలనీ వాసిని

విద్యుత్ నిలిపివేతపై ఆగ్రహం

- ట్రాక్టరు ఢీ కొట్టడంతో కూలిన విద్యుత్ స్తంభం
- నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- స్థానికులు, ముస్లిముల ఆందోళన

కారంపూడి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కారంపూడి చెక్‌పోస్టు సెంటరు వద్ద ఆదివారం ఓ ట్రాక్టరు విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. దీంతో స్తంభం పడిపోగా అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సోమవారం వరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించక పోవడంతో ఆ ప్రాంత ప్రజలు, ముస్లిములు ఆందోళనకు దిగారు. రహదారిపై బైటాయించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ముస్లిములు మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రారంభమైందని, ఈ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో తాగునీటి అవసరాలకు, ప్రార్థనలకు


ఆందోళన నిర్వహిస్తున్న ప్రజలు

ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. పంచాయతీ పరిధిలోని బోరు నీరు కూడా సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విద్యుత్ ఏఈ రామాంజనేయులును వివరణ కోరగా.. విద్యుత్ స్తంభం కూలిపోయిన ప్రాంతంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటుచేయాల్సి ఉందని, ఆ ప్రాంతానికి కొత్త స్తంభాన్ని తరలిస్తున్నామని, వెంటనే మరమ్మతులు చేపడతామని తెలిపారు.

ఫోక్సో కేసులు నమోదు

మాచర్లటౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రెండు ఫోక్సో కేసులు నమోదయ్యాయి. గత నెల 21న పట్టణంలోని 5వ వార్డుకు చెందిన ఓ బాలిక ఇంటి నుంచి కనిపించకుండా పోయింది. అదే రోజు బాలిక తల్లిదండ్రులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా ఐదు రోజుల క్రితం ఆ బాలికను పోలీసులు ఇంటికి తీసుకొచ్చారు. ముగ్గురు యువకులు మాయమాటలుచెప్పి బాలికను వారి వెంట తీసుకెళ్లినట్లు పోలీసుల విచారణ తేలింది. దీంతో పట్టణ పోలీసులు ఆ ముగ్గురు యువకులపై సోమవారం ఫోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

అలాగే గత నెల 25న పట్టణంలోని 13వ వార్డుకు చెందిన ఓ మైనర్ బాలిక కనిపించకుండా పోయింది. అదే రోజున బాలిక తల్లిదండ్రులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈనెల 2న పోలీసులు ఆ బాలికను ఇంటికి తీసుకొచ్చారు. ఆటోడ్రైవర్ మాయ మాటలు చెప్పి బాలికను తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఆటో డ్రైవర్‌పై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.


మునిసిపల్ కమిషనర్‌ను సన్మానించిన టీడీపీ నేతలు

మునిసిపల్ కమిషనర్‌కి సన్మానం

సత్తెనపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎన్ ఆనంద్ కుమార్‌కు మంగళవారం పలువురు టీడీపీ నేతలు కలసి అభినందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బలిజేపల్లి సురేష్ కుమార్, టీడీపీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండారు నాగరాజు, నేతలు చిలకా శ్యామ్, గుజ్జర్లపూడి స్టాలిని, చిలకా జిప్సన్, జయబాబు, చిలుకా నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, నందిగామ చిట్టిబాబు, కోటా సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అధిక లోడుతో వెళితే జరిమానా

నకరికల్లు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : సామర్థ్యానికి మించి ఎక్కువ మందితో ఆటోలో ప్రయాణిస్తే అధిక జరిమానా విధిస్తామని ఎస్ఐ చల్లా సురేష్ వాహన దారులను హెచ్చరించారు. సోమవారం రాత్రి అధిక లోడుతో వెళ్తున్న వివిధ వాహనాలను నిలిపి డ్రైవర్లకు, ప్రయాణీకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని, నిబంధనలు పాటించాలని కోరారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవటంతో పాటు అధిక రుసుం, జరిమానా విధిస్తామన్నారు.

ఘన వ్యర్థాల నిర్వాహణపై శిక్షణ

సత్తెనపల్లిరూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుడిపూడిలో సోమవారం జిల్లాలోని 28 మండలాల విస్తరణ అధికారులకు (ఈవోపీఆర్‌డీ)లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి హెచ్‌వీ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారం లేకుండా పారిశుధ్య నిర్వాహణ చేపట్టాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. తడి, పొడి చెత్త సేకరణ, చెత్త ద్వారా వర్మి కంపోస్టు ఎరువు తయారీ, చెత్త ద్వారా సంపద సృష్టి వంటి వాటిని ఆయన వివరించారు. శిక్షణలో నరసరావు పేట డివిజనల్ పంచాయతీ అధికారి వీపీఎం లక్ష్మణరావు, జిల్లా రిసోర్స్‌పర్సన్ నరసింహానాయక్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నకరికల్లు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినం వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. లింగ సమానత్వాన్ని ప్రోత్సహించటంలో, పితృస్వామ్యం సంప్రదాయాలను సవాల్ చేయటంలో పురుషులు పాల్గొటం.. ఆవశ్యకత అనే అంశంపై ఈ వ్యాస రచన పోటీలను నిర్వహించినట్టు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు.

5430 మంది నమోదు

నకరికల్లు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నిర్వహించిన రైతులకు విశిష్ట గుర్తింపుసంఖ్య నమోదు కార్యక్రమంలో ఇప్పటివరకు 5,430 మంది నమోదు అయ్యారని ఏవో కే దేవదాసు తెలిపారు. మండలంలో మొత్తం 8,864 మంది పీఎం కిసాన్ లబ్దిదారులు ఉన్నారన్నారు. వీరిలో 3,745 మంది, పీఎం కిసాన్‌లో లేని రైతులు 1685 మంది రైతు విశిష్ట గుర్తింపును సంఖ్యను నమోదు చేసుకున్నారన్నారు. రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కౌంటరు వద్ద భూమి గల ప్రతి రైతు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రెంటచింతల,మార్చి 3 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని పాలువాయి సబ్ స్టేషన్‌లో ఆర్‌డీఎస్ఎస్(రెవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం)పనులు ముమ్మరంగా జరుగుతున్న మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలను నిలిపి వేస్తున్నట్లు ఏపిట్రాన్స్‌కో ఏఈ మస్తాన్ వలి చెప్పారు.పాలువాయి,పాలువాయిగేట్,తుమృకోట గ్రామాల్లోని గృహవినియోగదారులు,రైతులు గమనించాల్సిందిగా కోరారు.

'బడి బాట'పై అవగాహన

రెంటచింతల,మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రవేశ దరఖాస్తులపై అవగాహన కల్పిస్తూ సోమవారం పట్టణంలోని ఎస్సీ కాలనీలో 'బడిబాట' కాలర్యక్రమంలో భాగంగా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరక్టర్ అమర్నాథ్ మాట్లాడుతూ నిరక్షరాస్యతను నిర్మూలన కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా స్వీకరించామన్నారు. ముందుగా గురుకుల పాఠశాల ప్రవేశ మోడల్ పేపర్‌ను విడుదల చేస్తూ, గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి ఏప్రిల్ 4న ప్రభుత్వం పరీక్ష నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏసీవో వేల్పుల రవి, దోరడ్ల సుధాకరుడు పాల్గొన్నారు.


క్రీడాకారులకు జెర్సీల పంపిణీ

క్రోసూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరులో టీడీపీ ఆధ్వర్యంలో ఈనెల 9నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్న నేపథ్యంలో క్రీడాకారులకు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంధ్రు కాశయ్య సోమవారం జెర్సీలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆశీస్సులతో ఈపోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అనుముల వెంకట రామిరెడ్డి, కర్నాటి కృష్ణారావు, దుద్దుల యోహాన్, జుజ్జూరి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

తూకంలో మోసం

- వెయింగ్ మిషన్‌లో చిప్ ఏర్పాటు
- రిమోట్ ద్వారా ఆపరేటింగ్
- పొగాకు రైతులను దగా చేస్తున్న వ్యాపారి
- అధికారుల తనిఖీల్లో గుట్టురట్టు


కాటాను తనిఖీ చేస్తున్న సీఐ


మిషన్‌లో అమర్చిన చిప్ (వేలి వద్ద)

సత్తెనపల్లిరూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఎలక్ట్రానిక్ కాటాలో చిప్ అమర్చి రిమోట్ కంట్రోల్ ద్వారా ఆపరేట్ చేస్తూ తూనికల్లో తేడాలకు పాల్పడుతూ రైతులను దగా చేస్తున్న ఓ వ్యాపారస్తుడి గుట్టును తూనికలు, కొలతల శాఖ అధికారులు సోమవారం రట్టుచేశారు. ఈ సంఘటనకు సంబంధించి ఆ శాఖ సీఐ ఎస్‌కే జాన్ సైదా తెలిపిన వివరాల ప్రకారం..

సత్తెనపల్లి మండలం కట్టావారిపాలెం గ్రామం వెళ్ళే రహదారిలో సత్తెనపల్లి- గుంటూరు ప్రధాన రహదారి పక్కన ఉన్న పొలాల్లో సోమవారం పొగాకు కొనుగోళ్ళు జరుగుతున్నాయి. రోజువారి తనిఖీల్లో భాగంగా సీఐ తన సిబ్బందితో కొనుగోళ్ళను పరిశీలించారు. తూనికల్లో తేడా ఉండటాన్ని వెంటనే వెయింగ్ మిషన్‌ను తనిఖీ చేయగా ప్రతి పది కిలోల బరువుకు కేజీ చొప్పున తూకంలో తేడా వస్తుండటాన్ని గమనించారు. వెంటనే మిషన్‌ను స్వాధీనం చేసుకొని పరిశీలించగా దానిలో ఎలక్ట్రానిక్ చిప్పు అమర్చి రిమోట్ కంట్రోల్ ద్వారా ఆపరేటింగ్ చేస్తూ తూకంలో మోసా నికి పాల్పడుతున్నారని గుర్తించారు. ఫిరంగిపురం మండలం తక్కెళ్ళపాడుకు చెందిన వ్యాపారి ఎస్ నరసింహారెడ్డి ఈ మోసానికి పాల్పడుతున్నట్టు సీఐతెలిపారు. మిషన్‌ను స్వాధీనం చేసుకొని వ్యాపారిపై చర్యలతోపాటు అపరాధ రుసుం విధించనున్నట్టు సీఐ తెలిపారు. ఎవరైనా తూనికలు, కొలతల్లో అక్రమాలకు ప్పాలడితే ఉపేక్షించేదిలేదని ఈసందర్భంగా సీఐ హెచ్చరించారు. రైతులు వ్యాపారులను గుడ్డిగా నమ్మవద్దని, ఏదైనా అనుమానం వస్తే తమను సంప్రదించాలని కోరారు.

బీమా నగదు చెక్కు అందజేత

మాచవరం, మార్చి3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిల్లుట్ల చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్రీనివాసబాబు ఇటీవల మృతి చెందిన ఓ వ్యక్తికి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి ఇన్సూరెన్స్ పథకం కింద మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఆమె కుటుంబీకులకు సోమవారంఅందజేశారు. గ్రామానికి చెందిన అంగన్ కొండలు చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంకులో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి ఇన్సూరెన్స్ సభ్యత్వం తీసుకున్నాడు. మూడు నెలల క్రితం అనారోగ్యంతో కొండలు చనిపోయాడు. కొండలుకు జీవిత బీమా పథకం కింద మంజూరైన రూ.2లక్షల చెక్కును అతడి భార్య నాగులుకు అందజేశారు.


చెక్కు అందజేస్తున్న చీఫ్ మేనేజర్ శ్రీనివాసబాబు


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న సివిల్ జడ్జి విజయకుమార్‌రెడ్డి

లోక్ అదాలత్‌పై దృష్టి సారించాలి

- సివిల్ జడ్జి ఎ.విజయకుమార్ రెడ్డి

సత్తెనపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు ఈనెల 8న జరిగే జాతీయ లోక్ అదలత్‌పై దృష్టి సారించాలని సివిల్ జడ్జి వీ విజయకుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక కోర్టులో సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో జడ్జి విజయ కుమార్‌రెడ్డి జాతీయలోక్ అదాలత్ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో వచ్చే కేసులు పరిష్కారమయ్యేలా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్టేషన్‌ల వారీగా క్రిమినల్ కేసుల్లో రాజీ పడదగిన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో సీఐలు బ్రహ్మాయ్య, శ్రీనివాసరావు, సురేష్, ఏపీపీ భగ్గి నరసింహారావుతో పాటు సబ్ డివిజన్ పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్‌ల ఎస్ఐలు పాల్గొన్నారు.

సాగు, తాగు నీటి సమస్యలను పరిష్కరించాలి

- అసెంబ్లీ సమావేశంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కృష్ణానది ఒడ్డున తమ నియోజక వర్గం ఉన్నప్పటికీ ఆయా ప్రాంతంలో సాగు నీరు, తాగు నీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే భాష్యంప్రవీణ్ కోరారు. రాజధాని అమరావతిలోని అసెంబ్లీలో సోమవారం ఏపీ బడ్జెట్ సమావేశం జరుగుతుండగా జీవో అవర్‌లో ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడారు. నియోజకవర్గంలో వ్యవసాయంపై ఆధారపడి జీవించే రైతు కుటుంబాలు ఉన్నప్పటికీ సాగు నీటి సమస్యతో రైతులు పంట నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు నీటి అవసరాలతో పాటు రాజధాని, తాగు నీటి అవసరాల కోసం అమరావతి మండలం వైకుంఠపురం వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి 2019లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారని, అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణ పనులను గాలికి వదిలి వేసిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. బ్రిడ్జి నిర్మాణం జరిగితే సాగు, తాగు నీటి అవసరాల కోసం 10 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవటంతో పాటు రాజధానికి రవాణా సౌకర్యాలు మెరుగు పడతాయని, నీటి పారుదల శాఖ మంత్రి బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. అలాగే సాగు నీటి అవసరాల కోసం నియోజకవర్గంలో ఎత్తి పోతల పథకాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ప్రవీణ్ కోరారు.

భావనారుషి బాలాలయం ప్రతిష్ఠ

పెదకూరపాడు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గారపాడులో భద్రావతి సమేత భావనారుషి స్వామి వారి ఆలయ ప్రాంగణంలో సోమవారం బాలాలయం ప్రతిష్ఠా కార్యక్రమాన్ని పూజారి బాలకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోలి యలమందయ్య, సంగెపు సుబ్బారావు, చేనేత సంఘం నేత చిల్లపల్లి సత్యం, గోలి వెంకటరావు, సామల సాంబశివరావు, చిన్న కిరణ్, అవ్వారు వెంకటేశ్వర్లు, గోలి విజయలక్ష్మి, సంగెపు వెంకట మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్లో యాక్టిజన్ క్లబ్ ప్రారంభం

పెదకూరపాడు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 75 తాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 'దేశ్ అప్నాఎన్ సహాయోగ ఫౌండేషన్' ద్వారా 6వ తరగతి విద్యార్థులకు యాక్టిజన్ క్లబ్ ప్రారంభ మైనట్టు ప్రధానోపాధ్యాయులు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సిటిజన్ షిప్ అనే టీమ్‌లో డ్యూటీ బాండ్ అనే అంశంపై విద్యార్థులతో అనేక నృత్యాలు చేయించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఇంటిలోని బాధ్యతలను పంచుకోవటమేకాకుండా సమాజంలో వారి విధులను, బాధ్యతలను తెలుసుకోవడంతో పాటు వాటిని సమర్థంగా నిర్వహిస్తారని తెలిపారు.


ఎదురెదురుగా వస్తున్న లారీలు ఢీ


- ఇద్దరికి తీవ్ర గాయాలు .. ఆస్పత్రికి తరలింపు

నకరికల్లు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అడ్డరోడ్డు నుంచి నరసరావుపేట వెళ్ళే మార్గంలో మాచవరం అడ్డరోడ్డు దాటిన తర్వాత ఆదివారం అర్ధరాత్రి దాటాక ఎదురెదురుగా వస్తున్న లారీలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బొల్లాపల్లి మండలం రేమిడిచర్ల గ్రామానికి చెందిన రైతులు కొందరు లారీలో మిర్చిని తీసుకని గుంటూరు వైపు వస్తున్నారు. మార్గమధ్యంలో నకరికల్లు అడరోడ్డు నుంచి నరసరావుపేట వెళ్ళే మార్గంలో మాచవరం అడ్డరోడ్డు దాటిన తర్వాత గోడౌన్‌ల వద్ద నరసరావుపేట వైపు నుంచి వస్తున్న గ్రానైట్ లారీ మిర్చి లోడుతో వెళ్తున్న లారిని ఢీకొట్టింది. అ ప్రమాదంలో మిర్చి లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ తోకల శ్రీరాములుకు, లారీలో ఉన్న రైతు మెతుకు శ్రీనుకు తలకు, కాళ్ళకు గాయాలయ్యాయి. వీరిద్దరిని ఒక ప్రైవేట్ వాహనంలో నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ చల్లా సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు కృషి

మాచర్లటౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికి సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని టీడీపీ సీనియర్ నేత, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా దినోత్సవం రోజున 1.02 లక్షల మంది మహిళలకు కుట్టు మిషన్లు అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. బీసీ సంక్షేమ కార్పోరేషన్ ద్వారా 46,044 మందిని, ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గాలకు చెందిన 45,772 మందిని, కాపు కార్పొరేషన్ ద్వారా 11,016 మందిని ఎంపిక చేసి లబ్ధి చేకూర్చనుందని తెలిపారు. మహిళలకు టైలరింగ్‌లో 90 రోజులపాటు శిక్షణ నిచ్చి, అనంతరం ఉచితంగా కుట్టుమిషన్లు అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో యాగంటి వెంట తిక్కా కొండలు యాదవ్, దేవరశెట్టి బ్రహ్మం, గాజుల చిన ఆంజనేయులు తదితరులు ఉన్నారు.




జెట్టిపాలెం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.పాపయ్య

పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య

- మోడల్ స్కూల్లో ప్రవేశానికి ఏప్రిల్ 20న పరీక్ష

రెంటచింతల,మార్చి 3 (ఆంధ్రజ్యోతి) :పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించే సంకల్పంతో ఆదర్శపాఠశాల వ్యవస్థకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ప్రిన్సిపాల్ కె పాపయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోడల్ స్కూల్లో ఆంగ్లమాధ్యమంలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఉచితంగా చదువుకోవచ్చని అన్నారు. మోడల్ స్కూల్లో ప్రవేశానికి ఈ నెల 31 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశం కోరే విద్యార్థికి 5వ తరగతి వరకు స్టడీ, కుల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని, ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 పరీక్ష ఫీజు చెల్లించాలని, జెట్టిపాలెం మోడల్ స్కూల్లో ఏప్రిల్ 20న ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఓసీ, బీసీ విద్యార్థులు కనీసం 35, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 30 మార్కులు సాధించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

పన్నులు చెల్లించి సహకరించండి: కమిషనర్

చిలకలూరిపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలోని అన్ని పన్నులను వెంటనే చెల్లించి మునిసిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు సోమవారం ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది వడ్డీ మాఫీ లేదని ఆయన తెలిపారు. ఆస్తి పన్ను చెల్లించకపోతే వడ్డీలు పెరిగి ఇబ్బందులు పడే అవకాశం ఉందని, మార్చి 31వ తేదీలోగా ఆస్తి పన్ను, కుళాయిల పన్నులను వెంటనే చెల్లించాలని ఆయన కోరారు. పన్నులను ఆన్‌లైన్ ద్వారా గాని, సచివాలయం ద్వారా గాని, మునిసిపాలిటీలో ఏర్పాటుచేసిన కౌంటర్ ద్వారా గాని, వాట్సాప్ ద్వారా కానీ చెల్లించి తగు రసీదు పొందాలని కోరారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

కాలుష్య కాసారం.. కొచ్చెర్ల చెరువు...

● డంపింగ్ యార్డును తలపిస్తున్న చెరువు
● రసాయనాలతో విషతుల్యమైన నీరు
● పట్టించుకోని అధికారులు, పాలకులు



కొచ్చెర్ల మంగలి వారి చెరువులో మృతిచెందిన చేపలు, రంగు మారిన చెరువు నీటిలో దిగిన గేదెలు

ఈపూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్ల మంగలి వారి చెరువు దశాబ్దాలుగా నిర్లక్షానికి గురై ఆక్రమణలతో కుచించుకుపోయింది. అంతేకాకుండా చెరువు డంపింగ్ యార్డును తలపిస్తూ కాలుష్య కాసారంగా మారింది. చెరువు నీరు తాగడానికి ఉపయోగపడకపోగా విషతుల్యంగా మారాయి. గ్రామానికి ఆనుకొని ఉన్న చెరువునీటిని గ్రామస్థులు తాగు, సాగు నీటికి ఉపయోగించుకుంటారు. పశువులకు తాగేందుకు నీటినే వినియోగిస్తుంటారు. గత కొంతకాలంగా పంచాయతీ పాలకులు చెరువులో చేపల పెంపకం కోసం పాటపెడుతున్నారు. కానీ చెరువు అభివద్ధికి పాటుపడడంలేదు. చెరువులో చేపలు పెంచుకునే వ్యాపారులు రకరకాల రసాయనాలు నీటిలో విడుదల చేయడం వలన ఆ నీరు విషంగా మారుతున్నాయి. దాంతో పశువులు రకరకాల వ్యాధులబారిన పడుచున్నాయి. ముఖ్యంగా ఎదకు వచ్చిన పశువులు చూడు కట్టడంలేదు. అందుకు కారణం గర్భకోశ వ్యాధులే కారణంగా వైద్యులు చెబుతున్నారు. పాలకులకు ఆదాయం మీద ఉన్న శ్రద్ధ చెరువు ప్రక్షాళపై ఉండటం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువులో నీరు ఉంటే గ్రామంలో బోర్లులో పుష్కలంగా నీరు ఉంటుంది. ప్రస్తుతం చెరువులో పూడిక పేరుకుపోయి లోతు పది అడుగులు వరకు తగ్గింది. దాంతో నీటి మట్టం లేకపోవడంతో చేతిపంపులకు నీరు అందని పరిస్థితి.

నీరు విషంగా మారాయి: గోలి వాసు, గ్రామస్థుడు

చెరువు నీటిలో వ్యర్థాలు పేరుకుపోవడంతో నీరంతా విషంగా మారాయి. గేదెల చూడు నిలవడం లేదు. చెత్తాచెదారంతో పాటు చేపల కోసం రకరకాల మందులు నీటిలో కలుపుతున్నారు. ఆ నీటిని తాగిన కొన్ని జంతువులు మరణిస్తున్నాయి. అంతేగాక చెరువులో చేపలు మృతిచెంది దుర్వాసన వస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ఈపూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని ముప్పాళ్ళలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన పులుకూరి గోపీచంద్ (26) సోమవారం ఉదయం పొలం వెళ్ళి బైక్‌పై వస్తుండగా పొనుగోటివారిపాలెం వెళ్ళే రోడ్డులో తిరుపతమ్మ గుడి వద్ద ఆటో ఢీకొట్టడంతో కిందపడిపోయాడు. స్థానికులు గమనించి గోపీచంద్‌ను గ్రామంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు చెప్పారు. గోపిచంద్ దుబాయ్‌లో ఒక నిర్మాణ సంస్థలో ఉద్యోగం చేస్తూ సెలవుపై ఇంటికి వచ్చాడు. చేతికందివచ్చిన కుమారుడు మృతి చెందటంతో శంకర్, శ్రీనివాసరావు దంపతులు గుండెలవిసేలా విలపిస్తున్నారు. మృతదేహానికి వినుకొండ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు సందర్శించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

9న క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు

యడ్లపాడు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పుటిగంపు సరిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9న ఉచిత క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు పుటిగంపు వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ స్థానిక నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో నిర్వహించే ఈ మెగా వైద్య శిబిరంలో రూ.5వేల విలువైన క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. విజయవాడకు చెందిన హెచ్‌సీజీ క్యాన్సర్ హాస్పిటల్, గుంటూరుకు చెందిన హెల్త్‌కేర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇస్తారన్నారు. శ్రీకృష్ణ ఫ్రీ మెడికల్ క్యాంప్స్ సంస్థ వైద్య శిబిరం నిర్వహణకు సహకారం అందిస్తున్నదన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 8106209777, 9866169955 నంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

శావల్యాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శావల్యాపురం ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు ఆధ్వర్యంలో జడ్పీ పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎస్ఐ లోకేశ్వరరావు తన సిబ్బందితో కలసి విద్యార్థులు రాస్తున్న వ్యాస రచన పోటీలను పర్యవేక్షించారు. ఎస్ఐ మాట్లాడుతూ వ్యాసరచన పోటీలతో విద్యార్థుల్లో చైతన్యం పెరుగుతుందని, అన్ని రంగాలపై అవగాహన పెరుగుతుందన్నారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించినపుడే సమాజం అభివృద్ధి చెందుతుందని, మహిళల రక్షణకోసం ప్రభుత్వం పటిష్ఠమైన చర్యలు చేపడుతుందన్నారు. మహిళా దినోత్సవం రోజున వ్యాసరచనలో ప్రతిభచూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

యడ్లపాడు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో మండలంలోని జగ్గాపురం, జాలాది, దింతెనపాడు గ్రామాలలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని సోమవారం నిర్వహించారు. యోగి ప్రబోధానంద పీఠం స్థాపకులు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర స్వామి రచించిన 100 ఆధ్యాత్మిక రచనలను ఆయా గ్రామస్థులకు పరిచయం చేశారు. అంతేగాకుండా ఫాల్గుణ మాసం విశిష్టత, హిందూ పండుగల గొప్పతనం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక నరసరావుపేట అధ్యక్షుడు ఘడియం పెద్దిరెడ్డి, సభ్యులు ఎలిశెట్టి రమేష్, పగడాల రామయ్య, చల్లగుండ్ల భాస్కరరావు, కోవూరి చిన్నవెంకటేశర్లు, పగడాల అశోక్, వెచ్చా రాజశేఖర్, కొమ్ము రాజశేఖర్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

పఠాన్ మాబు మేస్త్రి మృతి

చిలకలూరిపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రముఖుడు, పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు పఠాన్ మాబు మేస్త్రి (80) సోమవారం గుండయ్యతోటలోని స్వగృహంలో అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన దివంగత మాజీ శాసనసభ్యుడు సోమేపల్లి సాంబయ్య ప్రధాన అనుచరుడు. అనంతరం ఆయన వైసీపీలో చేరాడు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాబు మేస్త్రి గృహానికి వెళ్లి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మాబు మేస్త్రి మృతికి మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని ప్రగాఢ సంతాపం ప్రకటించారు. మాబు మేస్త్రీకి ఏపీఎం సుభాని, పఠాన్ యూసఫ్, ఇమ్మడి జానకిపతి, గోల్డ్ సుభాని, షేక్ అబ్దుల్లా, షేక్ అలిమియా, వేటపాలెం సుభాని, నిడమానూరి హనుమంతరావు, ఆషా గౌస్, అన్నపురెడ్డి వెంకటేశ్వర్లు తదితరులు నివాళులర్పించారు.

చివరి భూములకు సాగునీరు అందించేందుకే వారబందీ



రవ్వవరం ఎన్ఎస్‌పీ కాలువ వద్ద సమావేశమైన సాగు నీటి సంఘాల అధ్యక్షులు, ఎన్ఎస్‌పీ అధికారులు, రైతులు

● ఎన్ఎస్‌పీ ఈఈ డీవీ నారాయణ

నూజెండ్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చివరి భూములకు సమృద్ధిగా సాగు నీరు అందించేందుకే వారబందీ విధానాన్ని అమలు చేస్తున్నట్టు ఎన్ఎస్‌పీ ఈఈ డీవీ నారాయణ తెలిపారు. సోమవారం రవ్వవరం ఎన్ఎస్‌పీ రెగ్యులేటర్ వద్ద నీటి సంఘాల అధ్యక్షులు, రైతులతో కలసి ఎన్ఎస్‌పీ అధికారులు సమావేశం నిర్వహించారు. నీటి ఎద్దడి ఉన్న దృష్ట్యా పమిడిపాడు బ్రాంచ్ కెనాల్‌కు నీటి విడుదల తక్కువగా ఉండటంతో చివరి భూములకు నీరు అందేలా జమ్మలమడక, మోదేపల్లి మేజర్లకు వారబందీ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు జమ్మలమడకకు, తరువాత నాలుగు రోజులు మోదేపల్లికి సాగునీరు విడుదల చేస్తామన్నారు. ఈ సందర్భంగా ములకలూరు డీసీ చైర్మన్ నక్కా బుల్లీశ్వర రెడ్డి, మాజీ డీసీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు కాకాణి వీరాంజనేయులు పీబీసీ సామర్థ్యం మేరకు నీటి విడుదల జరిగేటట్టు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ముండ్లమూరు డీఈ పూర్ణచంద్రరావు, ఎన్ఎస్‌పీ అధికారులు ప్రసన్న, కేశవరరావు, గోపాల్, ప్రసాదు, బ్రహ్మనాయుడు, నీటి సంఘాల అధ్యక్షులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు వృథా కాకుండా పటిష్టమైన చర్యలు

గంటవారిపాలెం (శావల్యాపురం) మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నెస్పీ అధికారులు చాకచక్యంతో వ్యవహరించి అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలోని శానంపూడి మేజర్ వద్ద సకాలంలో మరమ్మతులను నిర్వహించి సాగునీరు వృథా కాకుండా సోమవారం ముందస్తు చర్యలు చేపట్టారు. శానంపూడి మేజర్‌ను పరిశీలించేందుకు వచ్చిన నరసరావుపేట ఎన్నెస్పీ డీఈఈ జరుగుల విజయలక్ష్మి ఎస్కేప్ చానల్ వద్ద రేకు వంగిపోవడాన్ని గుర్తించి సాగునీరు వృథా అయ్యే అవకాశం ఉందని ఎన్నెస్పీ ఈఈ డీవీ సుబ్బారావుకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఈఈ సాగునీరు లీకు కాకుండా ఇసుక బస్తాలు అమర్చాలని సిబ్బందిని ఆదేశించడంతో వెంటనే పనులు చేపట్టారు. దీనిపై డీఈఈ విజయలక్ష్మి మాట్లాడుతూ ఎస్కేప్ చానల్ వద్ద రేకు వంగిపోవడంతో సుమారు 100 క్యూసెక్కుల నీరు ఇప్పటికే వృథా అయిందని, కెనాల్‌లోని సాగునీరంతా వాగులోకి వెళ్ళి చేరుతుందన్నారు. దాంతో ఆయకట్టకు చివరనున్న భూములకు సాగునీరు అందే పరిస్థితి లేకుండా పోయేదన్నారు. రైతులు పంటలకు సాగునీరు అందకపోతే లిఖిత పూర్వకంగా ఎన్నెస్పీ అధికారులకు తెలియజేస్తే వెంటనే సాగునీరు అందేలా చూస్తామని, షట్టర్లను పాడుచేయడం వలన రైతులకు ఒరిగేదేమీ లేదన్నారు. ఆమెతో గంటవారిపాలెం డీసీ చైర్మన్ మందలపు వెంకటనారాయణ, సంతమాగులూరు డీసీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎన్నెస్పీ ఏఈ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూరు సచివాలయంలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు

వేల్పూరు (శావల్యాపురం) మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరు-1 సచివాలయంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు సోమవారం విస్తృతస్థాయి తనిఖీలు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు, జిల్లా గణాంకాల అధికారి నీలకంఠేశ్వరరావు, జిల్లా విస్తరణాధికారి శ్రీనివాసరావు గ్రామంలో ఇంటింటికీ తిరిగి వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా అందిస్తున్న సేవలపై గ్రామస్థులను ఆరా తీశారు. వైద్య సిబ్బంది గర్భిణులు, బాలింతలకు సకాలంలో ఆరోగ్య సేవలు అందిస్తున్నారా, పిల్లలకు ఐరన్‌మాత్రలు మింగిస్తున్నారా, రక్తహీనత పరీక్షలు చేస్తున్నారా, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ప్రజలకు సేవలందిస్తున్నారా అనే విషయాలను ప్రజలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం సచివాలయంలో వైద్యసేవల రికార్డులు, ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలు పరిశీలించారు. వైద్య సిబ్బంది రోగులకు అంకితభావంతో సేవలందించాలని, అన్నిరకాల వైద్యపరీక్షలను చేసి మందులందించాలన్నారు. సూపర్‌వైజర్‌లు ఏడుకొండలు, ఉమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ శిరీష, ఏఎన్ఎంలు విజయమ్మ, అమరలింగేశ్వరి పాల్గొన్నారు.



మిర్చి పంటను పరిశీలిస్తున్న అమలకుమారి

మిర్చి పంటను పరిశీలించిన డీపీఎం

నాదెండ్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కాపురం గ్రామానికి చెందిన రైతు తోట శ్రీనివాసరావు ప్రకృతి వ్యవసాయంలో పండించిన మిర్చి పంటను జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే అమల కుమారి పరిశీలించారు. శ్రీనివాసరావు ఎకరం పొలంలో ఎటువంటి రసాయన ఎరువులు ఉపయోగించకుండా 30రకాల పీఎండీఎస్ విత్తనాలు చల్లుకొని 40రోజుల తరువాత భూమిలో కలియదున్నాడు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం కషాయాలు వాడుకుంటూ జొన్న పెట్టుకొని ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాడు. ఈ క్రమంలో ఎకరానికి 25క్వింటాళ్ళ మిర్చిని పండించటంపై అమలకుమారి రైతు శ్రీనివాసరావును అభినందించారు. అలాగే ప్రకృతి వ్యవసాయం, పీఎండీఎస్ గురించి రైతులకు అవగాహన కల్పించారు.

ఆలయ నిర్మాణానికి రూ.10లక్షల విరాళం

నరసరావుపేట రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పులుపుల వారి వీధిలోని కోటబజారులో ఉన్న వీరాంజనేయ సహిత శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ రాతి నిర్మాణం కోసం దాతలు రూ.10 లక్షలు అందజేశారు. ఈ మొత్తాన్ని జాయింట్ సెక్రటరీ సబ్బి వీసు వెంకటరమణ చేతులు మీదుగా ఆలయ శిల్పికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దాతలు పాల్గొన్నారు.

ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు ప్రారంభం

నాదెండ్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామ పరిధిలోని చుండి రంగ నాయకులు కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొత్తం 469మంది విద్యార్థులకు 459మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. డీఐవో రేణుకాదేవి, చీఫ్ సూపరింటెండెంట్ అనుమంచి వెంకట శ్రీవత్సవ, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు. కాగా ఇంటర్ బోర్డు డీఈవోఎం నీలావతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.



నూజెండ్లలో మొక్కలు నాటుతున్న ఎంఈవో రవిచంద్ర, అంగన్‌వాడీ టీచర్లు

8న మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

● ఎంఈవో రవిచంద్ర

నూజెండ్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఎంఈవో ఎస్ రవిచంద్ర అన్నారు. సోమవారం మండలంలోని నూజెండ్లలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలంటూ ర్యాలీ నిర్వహించి జడ్పీ పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇన్నాసమ్మ, అంగన్‌వాడీ టీచర్లు అంజలి, ప్రసూన, పద్మ, వాణి, అనురాధ పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా మినరల్ వాటర్ ప్లాంట్‌లు

● ప్రమాణాలు పాటించని నిర్వాహకులు
● పట్టించుకోని అధికారులు



అనుమతులు లేకుండా నెలకొల్పిన వాటర్‌ప్లాంట్

వినుకొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పుట్టగొడుగుల్లాగా తాగునీటి వాటర్ ప్లాంట్‌లు పుట్టుకొస్తున్నాయి. మినరల్ వాటర్ పేరుతో సరఫరా చేస్తున్న తాగునీరు ఎంతమేరకు సురక్షితమో అర్థం కాని పరిస్థితి నెలకొని ఉంది. ఆయా వాటర్‌ప్లాంట్లలో తగిన ప్రమాణాలు పాటించేలా చూడాల్సిన అధికారులు సంవత్సరానికి ఒక్కసారి కూడా తనిఖీలు చేయకపోవడంతో వాటర్‌ప్లాంట్ నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని వాటర్ ప్లాంట్‌ల్లో ప్రమాణాలు పాటించకపోవడంతో ప్రజలకు నోరుపూయడం, ఎముకల సమస్యలు వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పెద్దలకు కూడా కీళ్ల నొప్పులు, అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు వీటిని కొనుక్కొని తాగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వాటర్ ప్లాంట్ దగ్గరకు వెళ్లి 20లీటర్ల క్యాన్ నీరు రూ.5 నుంచి రూ.10ల వరకు వసూలు చేస్తున్నారు. అదే ఇంటి వద్దకు ఆటో ద్వారా తీసుకొస్తే రూ.20లు వసూలు చేస్తున్నారు. దీంతో వాటర్‌ప్లాంట్ నిర్వాహకులకు మంచి వ్యాపార వసతిగా మారింది. నియోజకవర్గంలోని వినుకొండ, నూజెండ్ల, శావల్యాపురం, ఈపూరు మండలాల్లో వాటర్‌ప్లాంట్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పట్టణంలోనే సుమారు 20కు పైగా వాటర్‌ప్లాంట్‌లు ఉండగా మిగతా మండలాల్లో కూడా దాదాపు ప్రతి గ్రామంలో కూడా మినీ ఆర్వో ప్లాంట్‌లు ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులు వాటర్‌ప్లాంట్‌లను తనిఖీచేసి తాగునీరును ప్రజలకు అందించేలా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

చిట్ ఫండ్ బాధితులకు న్యాయం చేయాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



నరసరావుపేట టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో సాయిసాధన చిట్ ఫండ్ బాధితులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రభుత్వానికి అసెంబ్లీలో విజ్ఞప్తి చేశారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో అరవిందబాబు మాట్లాడుతూ సాయిసాధన చిట్ ఫండ్‌ను నిర్వహించిన పాలడుగు పుల్లారావు, అతని కుటుంబ సభ్యులు ప్రజలను మోసగించారని ఆరోపించారు. నరసరావుపేటలో గడచిన ఐదేళ్లలో చిట్ ఫండ్ మోసాలు జరిగాయన్నారు. రిజిస్టర్డ్ చిట్‌ల పేరుతో ప్రజలను సాయిసాధన చిట్ ఫండ్ నిర్వాహకులు మోసగించారన్నారు. దాదాపు రూ.200 కోట్లతో పుల్లారావు అతని కుటుంబ సభ్యులు పరారయ్యారన్నారు. దీనిపై పూర్తి వివరాలు హోం మంత్రికి అందించామన్నారు. రిజిస్ట్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ద్వారా విచారణ జరిపించాలని, ఇటువంటి మోసాలు రాబోవుకాలంలో జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పిల్లల భవిష్యత్ కోసం మాజీ ఉద్యోగులు, పిల్లల పెళ్లిల కోసం మరి కొందరు సాయి సాధనలో డిపాజిట్ల రూపంలో పొదుపు చేసుకున్నారని, వారందరికీ న్యాయం చేయాలని కోరారు.



ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వరికపూడిశెలకు నిధులు కేటాయించాలి

● ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

నరసరావుపేట టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎగువ పల్నాడు, బొల్లాపల్లి తదితర ప్రాంతాలకు ఉపయోగపడేలా వరికపూడిశెల ప్రాజక్టుకు నిధుల కేటాయింపు పనులు ప్రారంభించేలా చూడాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నరసరావుపేట కార్యాలయంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ బొల్లాపల్లి మండలంలో తాగునీరు లేక ప్రజలు అల్లాడుతున్నారని, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రాజెక్టు పూర్తిచేసే బాధ్యత నాదేనని, తప్పనిసరిగా దానికోసం కృషి చేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ కోటానాయక్, బాదుగున్నల శ్రీనివాసరావు, సురభి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



వీరయ్య కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న అటవీ శాఖ అధికారులు

బీట్ ఆఫీసర్ వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

నరసరావుపేట రూరల్, మార్చి 3: (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న వీరయ్య గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అటవీ శాఖ ఏపీజేఎఫ్‌వోఏ గుంటూరు యూనిట్ అధికారులు, పల్నాడు జిల్లా అటవీ శాఖ అధికారులు సోమవారం వీరయ్యను పరామర్శించారు. అనంతరం వీరయ్య వైద్య ఖర్చుల నిమిత్తం రూ.63,611 ఆర్థికసాయంను వారి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్ఎస్ అధికారి కృష్ణప్రియ, అడ్మినిస్ట్రేషన్ అధికారి వెంకటేశ్వరరావు, ఫారెస్ట్ రేంజ్ అధికారి మాధవరావు, యూనిట్ ప్రెసిడెంట్ సంతోష్, జాయింట్ సెక్రటరీ అమీర్ జానీబాషా, ట్రెజరర్ పురుషోత్తంరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం దిశగా మాలలు ముందుకు సాగాలి

● మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పౌలు

వినుకొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాజ్యాధికార దిశగా మాలల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కలుపుకొని ముందుకు సాగాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మతోటి పౌలు అన్నారు. పట్టణంలోని మాల మహానాడు కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్యపై టీఎం రమేష్‌మాదిగ అనుచిత వ్యాఖ్యలు చేశాడని, ఏనాడు కూడా మాలలు, మాల నాయకులు ఎవరిని కూడా కించపరిచేలా మాట్లాడలేదని, ఎస్సీలంతా చదువుకొని అంబేద్కర్ స్ఫూర్తిని తీసుకొని ఇంకా చైతన్యవంతులుగా అవ్వాలని, అందరినీ కలుపుకొని రాజ్యాధికార దిశగా ముందుకు సాగాలని కోరారు. ఇంకోసారి రమేష్ దురుసుగా మాట్లాడితే తగిన శాస్తి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు కర్లమాల కోటి, మాలప్రోలు ప్రకాష్, కొట్టాల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి సేద్య విధానంలో పండించిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ అమలకుమారి, ఎంపీడీవో హేమలత తదితరులు

రసాయనాలు లేని ఆహారంతో ఆరోగ్యం

● డీపీఎం అమలకుమారి

యడ్లపాడు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రసాయనాలు లేని ఆహార ఉత్పత్తులతో ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగించవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ అమలకుమారి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన యడ్లపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటుచేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలలో అధికంగా రసాయనాలతో పండించిన పంటలను వినియోగించడం ద్వారానే వస్తున్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో రసాయనాల ప్రసక్తే ఉండదని, ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే వాటితో కషాయాలు, ఎరువులు తయారుచేసి వినియోగించడం జరుగుతుందన్నారు. అలా పండించిన పంట ఉత్పత్తులలో ఎలాంటి హానికర రసాయనాలు ఉండవన్నారు. ప్రకృతి సేద్య విధానంలో పండించిన ఉత్పత్తులకు ఎంతో డిమాండ్ ఉందని, ప్రతి ఒక్కరూ వీటిపై అవగాహన పెంచుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హేమలతాదేవి, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.